

- రామగుండంలో వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రి
- రూ.150కోట్లతో నిర్మాణానికి టెండర్లు
- పాత డిస్పెన్సరీ ప్రాంగణంలో నిర్మాణం
- ఐదు అంతస్థుల్లో ఆసుపత్రి
- అత్యాధునిక వసతులతో నిర్మాణానికి ప్రణాళికలు
- 40వేల మంది కాంట్రాక్టు కార్మిక కుటుంబాలకు ప్రయోజనం



రామగుండంలో ఈఎస్ఐ ఆసుపత్రి ప్రతిపాదిత స్థలం

స్థలాన్ని పరిశీలిస్తున్న ఈఎస్ఐ బృందం

ఈఎస్ఐ ఆసుపత్రికి గ్రీన్ సిగ్నల్

కోల్‌సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామగుండం ప్రాంతంలో దశాబ్దాలుగా కార్మికులు ఎదురుచూస్తున్న ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది. నాలుగేళ్ల క్రితమే ఆసుపత్రి మంజూరైనా స్థలం లేదంటూ గతంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాల మధ్య వివాదాలు సాగాయి. దీంతో ఆసుపత్రి నిర్మాణం పెండింగ్ పడింది. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి ఈఎస్ఐసీ కేంద్ర కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న అంశంపై పలుమార్లు సంప్రదింపులు జరిపారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ స్వయంగా ఢిల్లీకి వెళ్లి ఈఎస్ఐసీ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. ఎంపీ వంశీకృష్ణ పార్లమెంట్‌లోనూ ఈ అంశాన్ని లేవనెత్తారు. దీంతో మూలకు పడుతుందనుకున్న ఆసుపత్రి నిర్మాణం ప్రతిపాదనలు బడ్జెట్ కేటాయింపులతో మళ్లీ ముందుకు సాగాయి. ఎట్టకేలకు ఈఎస్ఐ బోర్డు రామగుండం పట్టణంలో రూ.150.08కోట్ల వ్యయంతో ఆసుపత్రి నిర్మాణానికి ఆగస్టు 27న టెండర్లు పిలిచింది. 30నెలల్లో ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసేందుకు టెండర్లను ఆహ్వానించారు. సెప్టెంబర్ 25వ తేది టెండర్ దాఖలు చేసేందుకు గడువు కాగా సెప్టెంబర్ 26న టెండర్లను ఖరారు చేయనున్నారు.

● ఐదు అంతస్థుల్లో అత్యాధునిక ఆసుపత్రి..

రామగుండం పట్టణంలో ఐదు అంతస్థుల్లో మెడికల్ కౌన్సిల్‌ఆఫ్‌ఇండియా గైడ్‌లైన్స్ ప్రకారం ఆసుపత్రి నిర్మాణం జరుగనున్నది. జీప్లస్ 5ఫ్లోర్‌లో ఆసుపత్రి నిర్మించనున్నారు. అలాగే 8అంతస్థుల్లో 32స్టాఫ్ క్వార్టర్లను నిర్మిస్తారు. ఆసుపత్రిలో అత్యాధునిక వసతులు ఏర్పాటు చేయనున్నారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గైడ్‌లైన్స్, నేషనల్ బిల్డింగ్ కోడ్స్(ఎన్‌బీసీ) నిబం ధనల మేరకు ఈఎస్ఐసీ ఈ నిర్మాణం జరుపనున్నది. క్యాజువాలిటీ, ఎమర్జెన్సీ బ్లాక్, అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ వార్డులు, గైనిక్ వార్డులు, ఎంఆర్‌ఐతో కూడుకున్న రేడియాలజీ విభాగం, క్యాన్సర్ విభాగం, కీమో థెరపీ, డయాలసిస్, ఫార్మసీ, మెడికోల్ స్టోర్, బ్లడ్ స్టోరేజీ, ఫిజియో థెరపీ, యోగా సెంటర్లు, వేస్ట్‌మేనేజ్‌మెంట్ సిస్టం, సీవరేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం, ఆక్సిజన్ ప్లాంట్ తదితర నిర్మాణాలు జరుగనున్నాయి. సెంట్రల్ ఏసీతో నిర్మితమయ్యే ఈ ఆసుపత్రిలో ఆధు నిక సౌకర్యాలు కల్పించేందుకు నిధులు కేటాయించారు.

● రామగుండం పట్టణంలోనే నిర్మాణం..

ఈఎస్ఐ 100పడకల ఆసుపత్రిని రామగుండం పట్టణంలోని పాత ఈఎస్ఐ ఆసుపత్రి డిస్పెన్సరీ ప్రాంగణంలోనే నిర్మించనున్నారు. ఇక్కడ ఈఎస్ఐ ఆసుపత్రికి 3.75ఎకరాల స్థలం ఉన్నది. 1968లో ఈ డిస్పెన్సరీ, స్టాఫ్ క్వార్టర్లను నిర్మించారు. మొదట ఈ ఆసుపత్రి ప్రాంగణంలోనే భవనాలను వినియోగించుకుంటూ ఆసుపత్రి నిర్వహించాలని ప్రతిపాదించారు. ఎన్ఐటీ, వరంగల్ సివిల్ విభాగం ఈ మేరకు తనిఖీలు జరిపి సర్టిఫికెట్ కూడా ఇచ్చింది. కానీ

(మిగతా 8వ పేజీలో)

● బీ పవర్‌హౌస్ నుంచి నాలుగు లైన్ల రహదారి..

ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుని బీ పవర్‌హౌస్ నుంచి మసీదు కార్నర్ వరకు 80 అడుగుల్లో నాలుగు లైన్ల రహదారిని నిర్మిస్తున్నారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ మేరకు టెండర్ల ప్రక్రియ పూర్తై ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో పనులు కూడా మొదల య్యా యి. రహదారికి ఇరువైపులా అమృత్ పథకంలో డ్రైన్ల నిర్మాణం జరుగుతుంది. మసీదు కార్నర్ నుంచి ఆసుపత్రి వరకు రోడ్డును అభివృద్ధి చేసేందుకు సైతం రామ గుండం నగరపాలక సంస్థ నిధులు కేటాయించింది.



అద్దె భవనంలో కొనసాగుతున్న ఈఎస్ఐ ఆసుపత్రి

వినాయక మండపాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



రాఘవపూర్‌లో గణనాథుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్ /జూలపల్లి/ సుల్తానాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి, జూలపల్లి, సుల్తానాబాద్ మండలకేంద్రంలోని పలు వినాయక మండపాల్లో బుధవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు భక్తులతో కలిసి పూజలుచేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ గండు సంజీవ్, లోక జలపతిరెడ్డి, గడ్డం క్రిష్టారెడ్డి, బండిస్వామి, బండి రాజయ్య, పలువురు కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు. సుల్తానాబాద్‌లో ఆలయ కమిటీ చైర్మన్ అల్లెంకి సత్యనారాయణ భాగ్యలక్ష్మి అరుణ్, పండితులు వల్లంకొండ రమేష్ తదితరులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాశ్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పుష్పలత, తదితరులు పాల్గొన్నారు. పెద్దపల్లిలోని రాఘవపూర్‌లో ఏర్పాటు చేసిన గణనాధులను బుధవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పాట్లు



ముత్తారంలో చెప్పులు లైన్‌లో పెట్టిన రైతులు



ధర్మారంలో లైన్‌లో రైతుల పట్టాపాసుబుక్కులు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు పడిగాపు కాస్తున్నారు. మండలంలోని కూనారం సొసైటీకి యూరియా రావడంతో చుట్టుపక్కల గ్రామాల రైతులు బుధవారం తెల్లవారు జాము నుంచే భారీ సంఖ్యలో క్యూకట్టారు. ఇక్కడికి273బస్తాల యూరియా రాగా రైతులు వందలాదిగా ఎగబడ్డారు. సొసైటీకి వచ్చిన యూరియాకు రెట్టింపు సంఖ్యలో రైతులు రావడంతో ఎస్ఐ వెంకటేష్ తమ సిబ్బందితో వచ్చి రైతులకు సర్దిచెప్పి గొడవజరగకుండా చర్యలుచేపట్టి సరఫరా సజావుగా సాగేలాచూశారు. ఇందులో ఒక్కొక్కరికి రెండుబస్తాలు ఇవ్వడంతో పంటలకు సరిపోవని రైతులు వాపోయారు. మరికొందరు యూరియా అందక వెనుతిరిగారు. ఈవిషయంపై సింగిల్‌విండోచైర్మన్ గజవెల్లి పురుషోత్తం మాట్లాడుతూ త్వరలో మరోరెండు యూరియాలోడ్లు కూనారం సొసైటీకి వస్తాయని, అవిరాగానే మిగితా రైతులకు అందిస్తామని తెలిపారు.

ముత్తారం: మండలకేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయానికి బుధవారం ఉదయమే రైతులు యూరియా కోసం బారులు తీరారు. ఒక్కో రైతుకు ఒక్క బస్తా యూరియా ఇచ్చారు. ఒక్కబస్తా ఇస్తేఎలాగని అధికారులను ప్రశ్ని స్తున్నారు. త్వరలోనే రైతులకుసరిపడా యూరియా వస్తుందని, అధైర్యపడవద్దని సింగిల్‌విండో చైర్మన్ అల్లాడి యాదగిరిరావు తెలిపారు.

ధర్మారం: మండలంలోని రామయ్యపల్లి డీసీఎంఎస్ కేంద్రానికి 270బస్తాలు రాగా వాటి కోసం రైతులు బుధవారం ఉదయం 5గంటలకే సెంటర్ వద్దకు చేరుకున్నారు. దాదాపు 5వందల మంది రైతులు క్యూలో వేచి ఉన్నారు. మధ్యాహ్నం వరకు 270యూరియా బస్తాలు పంపిణీ చేయగా మిగతా రైతులు నిరాశతో వెనుదిరిగారు.

సేవా పక్వాడా అభియాన్ జిల్లా కన్వీనర్‌గా నల్ల మనోహర్‌రెడ్డి



మనోహర్ రెడ్డి

పెద్దపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకొని బీజేపీ దేశవ్యాప్తంగా సేవా పక్వాడా అభియాన్ కార్యక్రమాన్ని ఈనెల17 నుంచి అక్టోబర్2 వరకు నిర్వహించనున్నది. ఇందులో భాగంగా జిల్లా కన్వీనర్‌గా నల్లమనోహర్‌రెడ్డిని నియమించినట్లు బీజేపీ జిల్లాఅధ్యక్షుడు కర్రె సంజీవ్ రెడ్డి ప్రకటించారు. కమిటీసభ్యులుగా రామగుండం నుంచి కొండపర్తి సంజీవ్, పెద్దపల్లి మిట్టపల్లి ప్రవీణ్, కాసగోని నిర్మల, మంథని నుండి బొమ్మనా భాస్కర్‌రెడ్డిని నియమించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు జిల్లాస్థాయిలో రాణించాలి

ఎలిగేడు, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): కళోత్సవంలో భాగంగా బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో సాంస్కృతిక పోటీలను నిర్వహించినట్లు ఎంఈవో అనసూరి నరేంద్రచారి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం గంధ్ర దేవేందర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో మండలంలోని అన్ని ప్రభుత్వపాఠశాలల 9వ, 10తరగతి విద్యార్థులు పాల్గొనగా, సింగిల్, గ్రూపు వోకల్ మ్యూజిక్, నృత్యాలు, ఆర్ట్, 2డి డ్రాయింగ్ తదితర అంశాలలో ఎలిగేడు జడ్పీపాఠశాల విద్యార్థులు విజువల్ ఆర్ట్స్ 2డి, సుల్తాన్‌పూర్ జడ్పీ పాఠశాల విద్యార్థులు సింగిల్, గ్రూపు విభాగంలో వోకల్ మ్యూజిక్, సాంగ్, అలాగే ఎలిగేడు జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు గ్రూపు విభాగంలో వోకల్ మ్యూజిక్‌కు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజమణి, రమాదేవి, సీఆర్‌పీ లక్ష్మీనారాయణ, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలిగేడు మండల ఎస్సైగా మధుకర్

ఎలిగేడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండల ఎస్సైగా మధుకర్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ సత్యనారాయణ సాధారణ బదిలీల్లో భాగంగా రామగుండం వీఆర్‌కు బదిలీ అయ్యారు. నూతన ఎస్సై మధుకర్‌కు పోలీస్ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలి



పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

పెద్దపల్లి రూరల్/జూలపల్లి/ఎలిగేడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ బుధవారం కార్మికులు ఎంపీడీవో కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాంయస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీఖాజా, ఎలిగేడులో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరువురాల లచ్చయ్య మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రతలేదని ముఖ్యమంత్రి స్వయంగా జనవరి 2025 నుంచి ప్రతినెల ప్రభుత్వ ఉద్యోగులవలే వేతనాలను గ్రీన్‌ఛానల్ ద్వారా చెల్లిస్తామనగా నేటికీ ఎనిమిది నెలలు గడిచినా కూడా అమలు కాలేదన్నారు. ప్రస్తుతం వినాయకచవితి, రానున్న దసరా పండుగ సందర్భంగా పనులు గ్రామాలలో చేయాల్సింది కార్మికులేనని పండగపూట పస్తులు ఉంచకుండా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల ప్రధానకార్యదర్శి జంగ`ఎల్లి నరేష్, దొంత కనకయ్య, బందరి అశోక్, ఎండీ ముస్తఫా, ప్రభాకర్, పరుశరాములు, రాజయ్య, ఓదెలు, తదితరులు పాల్గొన్నారు. జూలపల్లిలో కార్మికులు ఆసంపెల్లి బానయ్య, మాంకాలి లచ్చయ్య, లక్ష్మిరాజం, ఎండీ అప్సర్, బెనర్జి, రాంచంద్రం, నాగయ్య, ఎలిగేడులో నాయకులు కవ్వంపల్లి దేవెందర్, నేరుడ కొమ్మ సత్యనారాయణ, కొండయ్య, నర్సయ్య మల్లమ్మ, రాజమ్మ, శంకరమ్మ, చిరంజీవి, న్యాతరి రవి, పంగ భాస్కర్, నారాయణ తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి విద్యార్థుల ఘన వీడ్కోలు



కనగర్తిలో ఎడ్ల బండిలో గురుదంపతులను ఊరేగిస్తున్న విద్యార్థులు

ఓదెల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యనేర్పిన గురుదంపతులను విజ్ఞతగా, వినూత్నంగా విద్యార్థులు ఎడ్లబండిలో ఊరేగించి ఘనంగా వీడ్కోలు పలికారు. మండలంలోని కనగర్తిలో దాసరి పద్మ, హనుమయ్య హైస్కూల్ సోషల్ ఉపాధ్యాయుడు ఎండీ రజాక్ మియా ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం విద్యార్థులు ఎడ్ల బండికి తాళ్లు కట్టి లాగుతూ బండిలో గురుదంపతులను ఊరేగించారు. అనంతరం ఓదెలలో సన్మానసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రమేష్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు.. విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలు, సమాజం పట్ల బాధ్యతలు పెంపొందించేందుకు ఉపాధ్యాయుడు రజాఖ్ చేసిన కృషిని గుర్తు చేశారు. అనంతరం గ్రామస్థులు దారిపొడవున పూల వర్షంతో తమ గురువుపట్ల విజ్ఞతను చాటారు. రజాక్‌మియా మాట్లాడుతూ, ఇన్నాళ్లుగా విద్యను అందించడం ఒక అదృష్టంగా భావిస్తున్నానని, విద్యార్థులంతా ఉన్నతంగా ఎదగడమే నా జీవితానికి, వృత్తికి అర్థమని తెలిపారు. అలాగే ఉపాధ్యాయులు, వివిధ పార్టీల నాయకులు, మాజీప్రజాప్రతినిధులు, ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంఈవోలు రమేష్, నరేంద్రచారి, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌ను సందర్శించిన జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

సుల్తానాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్రెపల్లి గ్రామంలోని తెలంగాణ మోడల్‌స్కూల్‌ను బుధవారం జిల్లా ఇంటర్మీడి యట్ అధికారి కల్పన సందర్శించారు. పరీక్షలకు సంబంధించిన పలుసందేహాలను నివృత్తి చేవారు. పరీక్షలను ధైర్యంగా ఎదుర్కోవడం కోసం పలు సూచనలు చేశారు. స్కూళ్లలోని ప్రాక్టికల్ ల్యాబ్‌లను పరిశీలించారు. ముఖ్యంగా ఇంటర్ సిలబస్, ప్రాక్టికల్ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోల్డి బల్బీర్‌కౌర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఐఈవో కల్పన

చదువుతోపాటు కళల్లో రాణించాలి

ధర్మారం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు కళల్లో రాణించాలని మండల విద్యాధికారి పి ప్రభాకర్ అన్నారు. కళోత్సవాల్లో భాగంగా మండలంలోని ఉన్నతపాఠశాలలో 12విభాగాల్లో నిర్వహించిన కళాపోటీల్లో పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో దాగివున్న కళను వెలికి తీయడానికి ప్రభుత్వం కళోత్సవాలు నిర్వహిస్తుందని తెలిపారు. 12 అంశాలలో ప్రథమస్థానం సాధించిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ధర్మారం కాంపెక్స్ హెచ్‌ఎం శీల, పత్తిపాక కాంప్లెక్స్ హెచ్‌ఎం నరేందర్ రావు, న్యాయ నిర్ణేతలు జాడి శ్రీనివాస్, శ్రీనివాసచారి, దేవేందర్, కందుకూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాను వాడాలి
● వ్యవసాయ అధికారులు

8లో

గణేష్ మండపాల్లో గోపూజలు, అన్నదానాలు

మొక్కలను కాపాడాలి

● డీపీవో వీర బుచ్చయ్య



కొత్తపల్లిలో నాటిన మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను కాపాడాలని పెద్దపల్లి జిల్లాపంచాయతీ అధికారి వీర బుచ్చయ్య అన్నారు. బుధవారం మండలంలోని పెద్దబొంకూర్, కొత్తపల్లి గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను డీపీవో పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల రక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని మొక్కలు ఎక్కడైనా చనిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటాలన్నారు. వారివెంట పెద్దపల్లి ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవోసురేందర్‌రావు, పంచాయతీకార్యదర్శి సురేందర్‌రావు,టెక్నికల్ అసిస్టెంట్‌దివ్య, ఫీల్డ్‌అసిస్టెంట్ సుమలత ఉన్నారు.

గణేష్ నిమజ్జనానికి విస్తృత ఏర్పాట్లు

● సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఈనెల 5న జరుగనున్న గణేష్ నిమజ్జనానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు అదనపుకలెక్టర్, రామగుండం నగరకమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌టీపీసీ, ఎన్‌పీడీసీఎల్, ఫిషరీస్, ఫైర్, ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామగుండం ప్రాంతంలోని గణనాథులతోపాటు మంచిర్యాల జిల్లానుంచి నిమజ్జనంకు వచ్చే గణనాథుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. సింగరేణి సంస్థ అదనపు ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేయడంతోపాటు క్రేన్‌లను సమకూర్చాలన్నారు. ప్లాట్‌ఫాంలు, క్రేన్‌ల సిబ్బంది షిఫ్టుల వారీగా పనిచేయాలని, నిమజ్జనం పూర్తయ్యేంత వరకు బాధ్యులందరూ విధుల్లోనే ఉండాలన్నారు. మెయిన్‌చౌరస్తాతోపాటు అన్ని కూడళ్లు, నిమజ్జనం జరిగే గోదావరి వంతెన, సమ్మక్క-సారలమ్మ పుష్కర ఘాట్ వద్ద విస్తృత లైటింగ్ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్‌పీడీసీఎల్ గోదావరిఖని మెయిన్‌చౌరస్తాతో పాటు గోదావరి వంతెన వద్ద అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను సమకూర్చాలని, సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉండాలన్నారు. నిమజ్జనం తరువాత గోదావరి వంతెన తరువాత రైస్ మిల్లు వద్ద యూటర్న్ ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఎలాంటి ఇబ్బంది కలుగకుండా జనరేటర్లను సమకూర్చుతున్నట్టు ఆమె పేర్కొన్నారు. సింగరేణి రెస్క్యూ సిబ్బంది పూర్తిగా అందుబాటులో ఉండాలన్నారు. నిమజ్జనానికిపిల్లలను పంపవద్దని, గోదావరి వంతెన నుంచి నిమజ్జనప్రాంతానికి ఎక్కువ మందిని అనుమతించేది లేదన్నారు. ఎన్‌టీపీసీసంస్థ ఆర్థిక వనరులను సమకూర్చడంతో పాటు స్కైలిఫ్టర్, రెండుక్రేన్‌లు ఇవ్వాలన్నారు. ఫిషరీస్ విభాగం స్పీడ్‌బోట్‌తో పాటు 25మంది గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థ గణపతి మండపాలకు స్వీట్‌ను ఇవ్వనున్నట్టు ఆమె తెలిపారు. సమీక్ష సమావేశంలో గోదావరిఖని ఏసీపీ రమేష్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రసాద్‌రావు, రాజేశ్వర్‌రావు, ప్రవీణ్, తహసిల్దార్ శ్రీపాద ఈశ్వర్, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్,ఎన్‌టీపీసీ, ఎన్‌పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

నిమజ్జన స్థలాలను పరిశీలించిన అధికారులు

ఓదెల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా గ్రామాల్లో శుక్రవారం నిర్వహించనున్న వినాయక నిమజ్జనం కోసం మంగళవారం అధికారులు నిమజ్జన స్థలాలను పరిశీలించారు. నిమజ్జనోత్సవాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండ, ప్రశాంతంగా కార్యం పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు పొత్కపల్లి ఎస్సై రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ తో పాటుఎంపీడీవో తిరుపతి, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

● ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గణనాధుల నిమజ్జనం దృష్ట్యా ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని రాఘవపూరు ప్రొఫెసర్ జయశంకర్ సమావేశం మందిరంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ గంగాధర్ మాట్లాడుతూ శుక్రవారం జరగనున్న వినాయక శోభాయాత్రల సందర్భంగా రోడ్లకు అడ్డంగాఉన్న విద్యుత్‌తీగలను సరిచేయాలన్నారు. శోభాయాత్ర ముగిసే వరకు విద్యుత్‌శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో పెద్దపల్లి డివిజనల్ ఇంజనీర్ టెక్నికల్, పెద్దపల్లి, మంథని డివిజనల్ ఇంజనీర్, కన్‌స్ట్రక్షన్ అండ్ ఎంఆర్టి సీనియర్ అకౌంట్స్ అధికారి, అసిస్టెంట్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల స్వచ్ఛ భారత్



ఖని పీజీ కళాశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న వలంటీర్లు

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని శాతవాహన యూనివర్సిటీ పీజీకళాశాలలో కొనసాగుతున్న జాతీయసేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేకశిబిరంలో భాగంగా మూడరోజు బుధవారం కళాశాల ఆవరణలో వలంటీర్లు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. కళాశాల మైదానంలో పిచ్చిమొక్కలు, ముళ్ళపొదలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ పీజీకళాశాల, ప్రభుత్వ డిగ్రీకళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్‌కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్‌కిరణ్మయి, డాక్టర్‌నరేష్, దామెరకొండ శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో సత్తాచాటిన ఐపీఎస్ విద్యార్థులు



క్రీడా పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులు

సుల్తానాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో మూడు రోజులపాటు జరిగిన మండల స్థాయి క్రీడాపోటీల్లో ఇండియన్ పబ్లిక్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు. కబడ్డీ అండర్ 14బాలికలు, బాలుర విభాగంలో మొదటి బహుమతి, వాలీబాల్ పోటీల్లో బాలికలు రెండో బహుమతి, అలాగే 17అండర్ విభాగంలో బాలికలు రెండవ బహుమతి సాధించారు. ఖోఖోలో అండర్ 17లో బాలికలు మొదటి బహుమతి, అండర్ 14 విభాగంలో రెండవబహుమతి గెలుపొందారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, శివ, సతీష్, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తాచాటిన సిరిసిల్ల విద్యార్థులు



రజిత పతకం అందుకున్న శ్వేదిక

కిక్ బాక్సింగ్‌లో రాష్ట్రానికి రజత, కాంస్య పతకాలు..

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. తెలంగాణ రాష్ట్రానికి రజతం, కాంస్య పతకాలను తీసుకొచ్చారు. తమిళనాడు రాష్ట్రం చెన్నై నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఐదు రోజుల పాటు జరిగిన జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలలో జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొన్నారు. కిక్ బాక్సింగ్ క్రియేటివ్ ఫామ్ వెపన్ ఓల్డర్ కెడేట్ బాలికల విభాగంలో గజ్జెల శ్వేదిక ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకుంది. యంగర్ కెడేట్ బాలుర విభాగంలో పాయింట్ ఫైట్, లైట్ కాంటాక్ట్ ఫైట్ ఈవెంట్లో గౌతమ్ ఆనంద్ తృతీయ స్థానంలో నిలిచి రెండు కాంస్య పతకాలను సాధించాడు. ఇండియా కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసి యేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధానకార్యదర్శి మహిపాల్, కోశాధికారి పన్నీరు శ్రీనివాస్ విద్యార్థులు శ్వేదిక కు రజత పతకం, గౌతమ్ ఆనంద్‌కు రెండు కాంస్య పతకా లను అందించి అభినందించారు.

ఈ సందర్భంగా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోచ్ వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ స్థాయి పతకాలను సాధించి జిల్లాకు విద్యార్థులు శ్వేదిక, ఆనంద్ ఖ్యాతిని తీసుకొచ్చారని అన్నారు. జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలో బంగారు పతకాలను సాధించిన వారు అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని, కొద్దిలో జిల్లా విద్యార్థులు ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోలేక పోయారన్నారు. మరో ప్రయత్నంలో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడానికి ఇప్పటి నుంచి మరింత సాధన అవసరం అని అన్నారు.



కాంస్య పతకాలను అందుకున్న గౌతమ్ ఆనంద్



సింగసముద్రం.. జల సోయగం..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎల్లారెడ్డిపేట మండలానికి ప్రధాన సాగు నీటి వనరైన సింగసముద్రం చెరువు జలసోయగంతో కనువిందు చేస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి సాగు నీటి వనరులోకి వరద నీరు వచ్చి చేరుతుండడం వల్ల మత్తడి పరవళ్లు తొక్కుతోంది. పర్యాటకులు జల దృశ్యాన్ని తిలకించేందుకు చెరువు వద్దకు చేరుకుంటున్నారు. పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. దూరం నుంచే సింగసముద్రం చెరువు అందాలను తిలకిస్తున్నారు. - ఎల్లారెడ్డిపేట, ఆంధ్రజ్యోతి

పూలతో పరిమళించిన పల్లె..

బహుజన బతుకమ్మ పాట చిత్రీకరణ



గోపారావుపల్లెలో బహుజన బతుకమ్మ షూటింగ్

సిరిసిల్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ఆటపాటతో పూలతో ముందే ఆ పల్లె పరమలించింది. బతుకమ్మ పండుగ నేపథ్యంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం బహుజన బతుకమ్మ పాట చిత్రీకరణ జరిగింది. జిల్లాలోని తంగళ్ళపల్లి మండలం గోపాలరావుపల్లెలో పాట షూటింగ్ చేశారు. బతుకమ్మలు పేర్చి ఆటా పాటలతో ఎంతో సంబరంగా జరిగిన షూటింగ్‌ను గ్రామస్థులు తరలి వచ్చి తిలకించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్కతో పాటు అనిత, రాకేష్‌లు పాటను గానం చేశారు. పాటను మిత్ర రచించారు. చిత్రీకరణకు దర్శకుడిగా గాయకుడు వంతడుపుల నాగరాజు, కెమెరామన్ కమ్లిపటేల్, ఒగ్గు కళాకారులు, డప్పు కళాకారులు, కోలాట బృందంతో పాటు కళాకారులు బుల్లెట్ వెంకన్న, శ్రీనివాస్ తదితరులు చిత్రీకరణలో ఉన్నారు.

జమ్మికుంటలో సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్‌పై హర్షం

భగత్‌నగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో దక్షిణ్, రాయపూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆపేందుకు అధికారులు నిర్ణయించడంపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి హజ్రత్ నిజాముద్దీన్ (దక్షిణ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నంబరు 12721), హజ్రత్ నిజాముద్దీన్ నుంచి హైదరాబాద్ (రైలు నంబరు 12722), సికింద్రాబాద్ నుంచి రాయపూర్ వరకు (రాయపూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నంబరు 12771) రైళ్లు ఇకపై జమ్మికుంటలో ఆగనున్నట్లు తెలిపారు. ఈ మూడు రైళ్లు ఆపేందకు ఒకటి రెండురోజుల్లో దక్షిణ మధ్య రైల్వే నోటిఫికేషన్ జారీ చేస్తుందని పేర్కొన్నారు. కరీంనగర్ నియోజక వర్గ పరిధిలోని ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని, తన ప్రతిపాదనకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్న రైల్వే అధికారులు, కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌డీ ఎంట్రన్స్‌లో మొదటి ర్యాంక్



వెంగల రఘు

శంకరపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి వెంగల రఘు (అంధ విద్యార్థి) ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ నిర్వహించిన పీహెచ్‌డీ ఎంట్రన్స్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించారు. ఇప్పలపల్లికి చెందిన రఘు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ ఎంఏ సోషియాలజీ పూర్తి చేశాడు. సెప్టెంబర్ 1 తేదీన వెల్లిడించిన ఫలితాల్లో ఓపెన్ కేటగిరిలో మొదటి ర్యాంకు సాధించాడు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- 2028లో బీజేపీదే అధికారం
- అవినీతిపై గ్రామ స్థాయి నుంచి ఉద్యమం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పోలింగ్ బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్, నాయకులు

కరీంనగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్‌లో నిర్వహించిన పోలింగ్ బూత్ అధ్యక్షులు, కార్యదర్శుల సమ్మేళనంలో పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టిన అనంతరం తొలి సారి కరీంనగర్‌కు వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌తో పాటు బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, జిల్లా పరిషత్‌లు అన్నింటిలోనూ బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు కేంద్ర ప్రభు త్వం కోట్లాది రూపాయలు నిధులు అందిస్తుందన్నారు. 11 సంవత్సరాల్లో రాష్ట్రానికి 12 లక్షల కోట్లు నిధులు వెచ్చించిందన్నారు. కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారి నిర్మాణం కోసం రెండు వేల కోట్లు కేటాయించిందన్నారు. బండి సంజయ్ కేంద్ర న్యాయశాఖ మంత్రితో మాట్లాడి కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ క్లాసులు ప్రారంభమయ్యేలా చూశారన్నారు.

స్థానిక అభ్యర్థులను గెలిపించే బాధ్యత నాదే

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత తనదేనన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు పని చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీటీసీగా గెలుపొందిన వారికి ఐదు లక్షలు, జడ్పీటీసీగా గెలుపొందిన వారికి పది లక్షల రూపాయలు అందిస్తామన్నారు. ఇప్పటి వరకు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు సైకిళ్లు అందించామని, బీజేపీని గెలిపిస్తే వచ్చే ఏడాది తొమ్మిదో తరగతి విద్యార్థులకు సైకిళ్లు అందిస్తామన్నారు. ఒకటి నుంచి ఆరో తరగతి చదివే విద్యార్థులకు మోదీ కిట్స్ అందిస్తామన్నారు. ప్రపంచంలోనే అత్యంత అతి పెద్ద కుంభకోణం కాళేశ్వరం స్కాం అన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలిచే అభ్యర్థులకే టిక్కెట్లు ఇస్తామని, కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు ఇచ్చి న్యాయం చేస్తామన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా రామ చందర్ రావు ఆధ్వర్యంలో గొల్కండ కోటపై కాషాయ జెండా ఎగురవేయయడం ఖాయమన్నారు. 2028లో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. స్థానిక ఎన్నికల్లో అత్యధిక సీట్లను గెలిపించి రామచందర్ రావుకు బహుమతి అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడికృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగెశోభ, మాజీ మేయర్లు డి శంకర్, సునీల్‌రావు పాల్గొన్నారు.



హాజరైన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

అవినీతి పార్టీలను తరిమికొట్టండి

ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి

భగత్‌నగర్: అవినీతి పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ లను తరిమికొట్టాలని శాసనమండలి సభ్యుడు చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. బుధవారం నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలింగ్ బూత్ అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ 20 నెలల పాలనలో ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడంతో ప్రజల్లో నమ్మకం కోల్పోయిందన్నారు. పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ అవినీతిలో కూరుకుపోయిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తల కృషి మరిచిపోలేనని, రానున్న స్థానిక ఎన్నికల్లో తనకు ఏ బాధ్యతలు అప్పగించినా శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెర వేర్చలేదన్నారు.



రేణికుంట టోల్‌గేట్ వద్ద భారీ స్వాగతం

తిమ్మాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికై మొదటిసారి కరీంనగర్ జిల్లాకు వచ్చిన రాంచందర్‌రావుకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. రేణికుంట వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు గజామాల వేశారు. అనంతరం రేణికుంట నుంచి భారీ కన్వాయ్‌తో ర్యాలీగా బయలుదేరి కరీంనగర్ పరిధిలోని అలుగునూర్ కూడలి వరకు తరలివెళ్లారు. అలుగునూర్ వద్ద కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు ఘన స్వాగతం పలికారు. ఇద్దరు కలిసి అలుగునూర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, తిప్పర్తి నికేష్, జిల్లా నాయకులు సొల్లు అజయ్‌వర్మ, దండు కొమురయ్య, గుర్రాల వెంకటరెడ్డి, కొమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, చింతం శ్రీనివాస్, దుర్శెట్టి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

ఎలిగేడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పిరితోట గ్రామంలో బుధవారం ఊరకుక్కల దాడిలో అల్లి జయఆదిత్య(4) తీవ్రంగా గాయపడ్డాడు. ఉదయం పూట బిస్కెట్ల కోసం షాప్‌కు వెళ్లి వస్తున్న క్రమంలో కుక్కల మంద అతనిపై దాడి చేసింది. పక్కన ఉన్న వారు తేరుకునే సరికి తీవ్రంగా గాయపరిచాయని గ్రామస్థులు పేర్కొన్నారు. బాలున్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడికి కుక్కకాటుకు సంబంధించిన వైద్యం అందిస్తున్నామని బాలుడి తండ్రి మనోజ్ పేర్కొన్నారు.

కుక్కలను తప్పించబోయి అధ్యాపకుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్ర జ్యోతి):మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులో కుక్కలను తప్పించబోయిన అదే గ్రామానికి చెందిన అధ్యాపకుడు నీరటి విష్ణుప్రసాద్ బుధవారం తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రుడిని స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గ్రామంలోని విష్ణుప్రసాద్ తన బైక్‌పై విధులు నిర్వహించేందుకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బయలుదేరారు. గ్రామ శివారులో ఒక్కసారిగా కుక్కలు అడ్డు వచ్చాయి. వాటిని తప్పించబోయి కింద పడ్డారు. గ్రామంలో కుక్కల బెడద అధికమైందని, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకుని నివారించాలని ప్రజలు కోరారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



చిన్నయ్య (ఫైల్)

పాలకుర్తి/ఎండపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎండపల్లి మండలం మారేడుపల్లిలో విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లింగాల చిన్నయ్య(52) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. రాత్రి 12 గంటల వరకు వెతి కినా ఆచూకీ దొరకలేదు. ఫోన్ రింగ్ అవుతున్నా లిఫ్ట్ చేయలేదు. బుధవారం ఉదయం అతని కూతుళ్లు పొలం వద్దకు వెళ్లి చూడగా పొలం వద్ద విద్యుదాఘాతంతో మృతిచెంది ఉన్నాడు. మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసులకు చిక్కిన బైక్ దొంగిలించిన వ్యక్తి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లోని విజయ్‌నగర్ కాలనీలో కొద్ది రోజుల కిందట బైక్‌ను దొంగిలించిన వ్యక్తిని బుధవారం వాహనాల తనిఖీల్లో పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. విజయ్‌నగర్ కాలనీకి చెందిన అబ్దుల్ రహమాన్ తన బైక్‌ను ఇంటి ఎదుట పార్క్ చేసి మరుసటి రోజు ఉదయం చూసే సరికి బైక్ కనిపించలేదు. వెంటనే బాధితుడు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బొమ్మకల్ ఫ్లై ఓవర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా రజ్వీచమన్ ప్రాంతానికి చెందిన షేక్ షాదుల్ అనే వ్యక్తి పోలీసులను చూసి బైక్‌తో తప్పించుకునేందుకు యత్నించాడు. గమనించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా బైక్ దొంగతనం చేసినట్లు వెల్లడైంది. ఈ మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురు వాహనదారులకు కరీంనగర్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జిలు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. కరీంనగర్‌లోని గౌతమినగర్‌కు చెందిన తమ్మిశెట్టి వరప్రసాద్(26)కు 3 రోజులు సాధారణ జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా, మానకొండూర్‌కు చెందిన దాసరిగొండ రవి(34)కు రెండు రోజుల సాధారణ జైలు, రాంపూర్‌కు చెందిన తోట రాజ్‌కుమార్(53)కు ఒక రోజు సాధారణ జైలుశిక్ష విధించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న డ్రంకెన్ డ్రైవ్‌పై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామని, మద్యం మత్తులో వాహనం నడపడం నేరమని పేర్కొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు

1.2కిలోల గంజాయి స్వాధీనం

కోల్‌సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గణపతి నిమజ్జనం సందర్భంగా గోదావరిఖనిలో విక్రయించేందుకు గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అడ్డగుంటపల్లిలోని సిరి ఫంక్షన్‌హాల్ సమీపంలో పట్టుకున్నట్టు ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. కొత్తగూడెం బూడిదగడ్డకు చెందిన ఆటోడ్రైవర్ కోడూరి అభినవ్‌వర్ధన్(26), గోదావరిఖని శివాజీనగర్‌కు చెందిన పెయింటింగ్ వర్కర్ చెరుకు శ్రీనివాస్(29)ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1.220కిలోల పొడి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. కొత్తగూడెంకు చెందిన అభినవ్ వర్ధన్ సీలేరు ప్రాంతం నుంచి గంజాయి తీసుకువచ్చి హైదరాబాద్, ఇతరప్రాంతాల్లో అమ్మేవాడన్నారు. గోదావరిఖనికి చెందిన శ్రీనివాస్ తనసోదరి ఇంటికి కొత్తగూడెంకు వెళ్లగా అక్కడ అభినవ్‌తో పరిచయడం ఏర్పడిందని, ఇద్దరు గంజాయి సేవించే వారు కావడంతో స్నేహంగా మారి గంజాయి రవాణాకు పథకం వేశారన్నారు.

గోదావరిఖనిలో గణపతి నిమజ్జనం ఉన్నందున చిన్న ప్యాకెట్లుచేసి అమ్మడం వల్ల ఎక్కువ డబ్బులు వస్తాయని శ్రీనివాస్ చెప్పాడని, కిలోకు రూ.15000చొప్పున మాట్లాడుకుని, అడ్వాన్స్‌గా రూ.5వేలు ఇచ్చాడన్నారు. భద్రాచలం అటవీప్రాంతాల నుంచి గంజాయి తీసుకు వచ్చిన అభినవ్ గోదావరిఖనిలో అమ్మేందుకు ప్రయత్ని స్తు న్నాడనే సమాచారంతో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు రమేష్, అనూష, క్రైమ్‌పార్టీ హెడ్ కానిస్టేబుల్ రమేష్, శ్రీనివాస్, సదానందం, కానిస్టేబుళ్లు రమేష్, మధుకర్, మధుసూధన్ దాడిచేసి పట్టుకున్నారన్నారు.



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రమేష్

చికిత్స పొందుతూ యువకుడు మృతి

తిమ్మాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఆదివారంపేటకు చెందిన ఇల్లందుల సన్ని (20) మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడి బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కరీం నగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని సుభాష్‌నగర్ స్టేజీ వద్ద సన్ని తన ద్విచక్రవాహనంతో యూటర్న్ తీసుకుంటుండగా హైదారాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపు వస్తున్న కారు డ్రైవర్ అతివేగంగా నడుపుకుంటూ వచ్చి సన్ని ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడటంతో స్థాని కులు 108 వాహనంలో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కోళ్ల పందేల స్థావరంపై దాడి..

ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోళ్ల పందెం స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. బుధవారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి శివారులో కోళ్ల పందెం స్థావరంపై ఎస్ఐ ఉపేంద్రచారి తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. నిందితుల వద్ద నుంచి రూ.45160లతో పాటు మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యను వేధించిన భర్తకు మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భార్యను వేధించిన ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామానికి చెందిన సదిమెల రామచంద్రంకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ బుధవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ తీర్పు ఇచ్చారు. ముస్తాబాద్ ఎస్ఐ గణేశ్ వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామానికి చెందిన సదిమెల రామచంద్రం తన భార్య కనుకవ్వను తరచూ మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. మద్యం సేవించి గొడవలు పెట్టడంతో డిసెంబరు 2, 2016న భార్యపై దాడిచేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. భార్య కనుకవ్వ ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడు రామచంద్రంపై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు అప్పటి ఎస్ఐలు చిట్టిబాబు, ప్రవీణ్‌లు చార్జిషీట్ దాఖలు చేయగా పీపీ సందీప్ వాదనలు వినిపించారు. కోర్టు కానిస్టేబుల్ దేవెందర్ 12మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. దీంతో నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్ష, రూ. 10వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

కరీంనగర్ క్రైం, సె ప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బైపాస్‌రోడ్‌లోని పెట్రోల్ బంక్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం పందిళ్లకు చెందిన దబ్బెట రాధ(47) మృతి చెందింది. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం.. పందిళ్లకు చెందిన రాధ, ఆమె భర్త మల్లయ్య ద్విచక్ర వాహనంపై కరీంనగర్ వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎస్ఆర్ పెట్రోల్ బంక్ వద్ద ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు రోడ్డుపై పడి పోగా రాధ పైనుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. లారీ డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని మృతురాలి భర్త మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



రాధ (ఫైల్)

పందిళ్లలో విషాదం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిళ్ల గ్రామానికి చెందిన దబ్బెట రాధ (55) కరీంనగర్‌లో బుధవారం లారీ ప్రమాదంలో మృతిచెందగా పందిళ్ల గ్రామంలో విషాదం అలుముకుంది. రాధ తన భర్త మల్లయ్యతో కలిసి కరీంనగర్‌లోని ఆసుపత్రిలో వైద్య చికిత్స నిమిత్తం ద్విచక్ర వాహనం పై వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామంలో అందరితో కలిసి మెలిసి ఉండే రాధ మృతి చెందడంతో విషాదం అలుముకుంది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



రాధ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మన్‌దీప్ గోల్‌తో గట్టెక్కింది!

కొరియాతో భారత్ మ్యాచ్ డ్రా

ఆసియా కప్ హాకీ


రాజ్‌గిర్ (బిహార్): ఆట ముగిసేందుకు మరో ఎనిమిది నిమిషాలే ఉంది. స్కోరు చూస్తే భారత్ 1-2తో కొరియాతో సూపర్ ఫోర్ తొలి మ్యాచ్‌లో వెనుకంజలో ఉంది. దాంతో ఆసియా కప్ హాకీ టోర్నీలో ఆతిథ్య భారత్‌కు తొలి పరాజయం తప్పదేమో అనిపించింది. కానీ ఈ దశలో ఫార్వర్డ్ మన్‌దీప్ సింగ్ మాయ చేశాడు. లెఫ్ట్ ఫ్లాంక్ నుంచి హర్మన్‌ప్రీత్ అందించిన రివర్స్ పాస్‌ను సుఖ్‌జీత్ సింగ్..మన్‌దీప్ వైపు కొట్టాడు. బంతిని అందుకున్న మన్‌దీప్ నలుగురు కొరియా డిఫెండర్లను బోల్తాకొట్టిస్తూ గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. అంతే.. స్కోరు 2-2తో సమం. భారత ఫ్యాన్స్‌లో ఆనందం. సూపర్-4లో భాగంగా కొరియాతో బుధవారం జరిగిన మ్యాచ్‌ను భారత్ డ్రా చేసింది. దాంతో టోర్నమెంట్‌లో అపజయమెరుగని రికార్డును ఆతిథ్య జట్టు కొనసాగించింది. ఎనిమిదో నిమిషంలోనే హర్దిక్ సింగ్ గోల్ చేసి భారత్‌ను ఆధిక్యంలో నిలిపాడు. యాంగ్ జిహూన్ (12) గోల్‌తో స్కోరు సమం చేసిన కొరియా..కొద్ది సేపటికే కిమ్ (14) సాధించిన గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లింది. డ్రా దరిమిలా రెండు జట్లు చెరో పాయింట్ దక్కించుకున్నాయి. మరో సూపర్ ఫోర్ పోరులో మలేసియా 2-0తో చైనాను చిత్తు చేసింది. ఇక గురువారం జరిగే సూపర్-4 రెండో మ్యాచ్‌లో మలేసియాను భారత్ ఢీకొంటుంది.



మన్‌దీప్ సింగ్

జొకో.. జోరు

యూఎస్ ఓపెన్



సెమీస్‌కు నొవాక్, సబలెంక

న్యూయార్క్: 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్, మహిళల డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక యూఎస్ ఓపెన్ సెమీస్‌కు దూసుకెళ్లారు. గతేడాది రన్నరప్, లోకల్ స్టార్ టేలర్ ఫ్రిట్జ్‌తో ముఖాముఖి పోరులో ఏడో సీడ్ జొకో తన రికార్డును 11-0తో మరింతగా మెరుగుపర్చుకొన్నాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో జొకో 6-3, 7-5, 3-6, 6-4తో నాలుగో సీడ్ ఫ్రిట్జ్‌పై సునాయాసంగా గెలిచాడు. ఈ క్రమంలో 53వసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్ చేరిన నొవాక్.. అమెరికా లెజెండ్ క్రిస్ ఎవర్ట్ 52సార్లు సెమీస్ చేరిన రికార్డును బద్దలుకొట్టాడు. సెమీస్‌లో అల్కారజ్‌తో జొకో అమీతుమీ తేల్చుకోనున్నాడు. తొలి సెట్‌లో నొవాక్ అలవోకగా నెగ్గినా.. రెండో సెట్‌లో ఫ్రిట్జ్ నుంచి పోటీ ఎదురైంది. అయితే, 5-5 వద్ద తనదైన దూకుడు ప్రదర్శించిన నొవాక్ సెట్‌ను సొంతం చేసుకొని 2-0 ఆధిక్యంలోకి వెళ్లాడు. కానీ, మూడో సెట్‌లో ఫ్రిట్జ్ పోరాడి గెలిచినా.. ఆ తర్వాతి సెట్‌లో జొకో జోరు ముందు నిలవలేక పోయాడు. 2003లో చివరిసారి అమెరికా ఆటగాడు ఆండీ రాడిక్ న్యూయార్క్‌లో టైటిల్ నెగ్గాడు. ఈసారి ఫ్రిట్జ్ ఆ లోటు తీరుస్తాడనుకొంటే.. జొకో అడ్డుపడ్డాడు. కాగా, టాప్‌సీడ్ సబలెంకకు క్వార్టర్స్‌లో వాకోవర్ లభించింది. ప్రత్యర్థి మార్కెటా వొండ్రుసొవా (చెక్) ప్రాక్టీస్ చేస్తుండగా మోకాలికి గాయమైంది. దీంతో ఆమె బరిలోకి దిగలేక పోయింది. శుక్రవారం జరిగే సెమీస్‌లో గతేడాది ఫైనలిస్ట్ పెగులతో స బలెంక తలపడనుంది.



సబలెంక

భాంబ్రి తొలిసారి..: యుకీ భాంబ్రి కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో భాంబ్రి-మైకేల్ వీనజ్ (న్యూజిలాండ్) జంట 6-4, 6-4తో జర్మనీకి చెందిన కెవిన్ క్రవీట్జ్-టిమ్ ప్యూట్జ్‌పై గెలిచింది.

నొవాక్ 'సోడా పాప్' సంబరాలు


మ్యాచ్ గెలిచిన తర్వాత జొకోవిచ్ 'కె-పాప్ డీమన్ హంటర్స్' సినిమాలోని 'సోడా పాప్' పాట డ్యాన్స్‌తో సంబరాలు చేసుకొన్నాడు. జొకో కుమార్తె తారకు 'కె-పాప్ డీమన్ హంటర్స్' అంటే ఎంతో ఇష్టం. కాగా, తార పుట్టిన రోజు కావడంతో.. ఆ డ్యాన్స్ మూమెంట్స్ ద్వారా కుమార్తెకు జొకో శుభాకాంక్షలు తెలిపాడు.

సినర్‌పై రూ. 2.64 కోట్ల పందెం

ఈ ఏడాది యూఎస్ ఓపెన్ టైటిల్‌ను డిఫెండింగ్ చాంప్ యానిక్ సినర్ నిలబెట్టుకొంటాడని కెనడా ర్యాపర్, సింగర్ డ్రేక్ భారీగా బెట్టింగ్ పెట్టాడు. ఇటలీ టాప్ సీడ్ ప్లేయర్‌పై డ్రేక్ రూ. 2.64 కోట్లు పందెం కాశాడు. ఒకవేళ సినర్ విజయం సాధిస్తే.. డ్రేక్‌కు రూ. 4.46 కోట్లు దక్కనున్నాయి.

నిఖత్‌పై అందరి దృష్టి!

నేటినుంచి ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్



లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రతిష్ఠాత్మక వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్ గురువారం ఇక్కడ ఆరంభం కానున్నాయి. ప్రపంచ బాక్సింగ్ కొత్త పాలక మండలి..'వరల్డ్ బాక్సింగ్' ఆధ్వర్యంలో తొలిసారి ఈ పోటీలు జరగనున్నాయి. ఈ చాంపియన్‌షిప్స్‌ను పురుషులు, మహిళల విభాగాలలో కలిపి ఒకేసారి నిర్వహిస్తుండడం విశేషం. ఇక..భారత్‌కు సంబంధించిన తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్‌పై అందరి దృష్టి నిలిచింది. రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ వరుసగా మూడో వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో మూడు వేర్వేరు బరువు విభాగాలలో తలపడుతుండడం గమనార్హం. 2022లో 52కి. విభాగంలో విశ్వవిజేతగా నిలిచిన నిఖత్.. 2023లో 50కి. కేటగిరీలో టైటిల్ దక్కించుకుంది. ఇక ఈసారి 51 కి. విభాగంలో తలపడుతోంది. మారిన బరువు విభాగంలో నిఖత్ ఎలా రాణిస్తుందన్నది ఆసక్తికరం. పారిస్ ఒలింపిక్స్‌లో రెండో రౌండ్‌లోనే ఓటమి చవిచూసిన జరీన్.. ఏడాది తర్వాత అంతర్జాతీయ పోటీల బరిలో దిగుతోంది. పారిస్ క్రీడల తర్వాత నిఖత్‌తోపాటు లవ్లీనా ఒక దేశవాళీ ఈవెంట్‌లో మాత్రమే పాల్గొన్నారు. ఇద్దరికీ తొలి రౌండ్లలో కఠిన ప్రత్యర్థులు ఎదురు కానున్నారు. 65 దేశాల నుంచి 550మంది బాక్సర్లు ఈ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో తలపడుతున్నారు. భారత్ నుంచి పురుషుల, మహిళల విభాగాల్లో చెరి పదేసి మంది బాక్సర్లు పోటీపడుతున్నారు.

రోహిత్, గిల్ అండ్ కోకు 'బ్రాంకో టెస్ట్' లేనట్టే..



న్యూఢిల్లీ: భారత జట్టు ఆటగాళ్లకు బీసీసీఐ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ)లో ఫిట్‌నెస్ టెస్ట్‌లు నిర్వహిస్తూంటుంది.. ఇది రొటీన్‌గానే జరిగేదే అయినా.. సరికొత్తగా 'బ్రాంకో' టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నారని కొద్ది రోజుల క్రితం వచ్చిన వార్త కారణంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. రగ్బీ ఆటగాళ్లకు నిర్వహించే ఈ కఠిన పరీక్షను రోహిత్ శర్మను బయటకు పంపేందుకే ప్రవేశపెడుతున్నారంటూ విమర్శలు కూడా వినవచ్చాయి. తాజా సీజన్ నేపథ్యంలో రోహిత్, శుభ్‌మన్ గిల్, బుమ్రా సహా మరికొందరు కాంట్రాక్ట్ ప్లేయర్లు సీవోఈలో ఫిట్‌నెస్ పరీక్షకు హాజరయ్యారు. అయితే, వీరెవరికీ బ్రాంకో టెస్ట్ నిర్వహించలేదని తెలుస్తోంది. ఈ నూతన టెస్ట్‌ను ఇంకా ఫిట్‌నెస్ పరీక్షల్లో భాగం చేయలేదట. అందుకే పాతపద్ధతిలో యో-యో టెస్ట్ ద్వారానే ఫిట్‌నెస్‌ను పరీక్షించిందట. పైగా బోర్డు కూడా బ్రాంకో టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నట్టు అధికారికంగా కూడా ప్రకటించలేదు.

బెంగాల్‌పై పుణెరి గెలుపు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్-12 తొలి అంచెలో భాగంగా బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 45-36 స్కోరుతో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. ఆట ప్రారంభం నుంచి పల్టన్ ఆటగాళ్లు దూకుడుగా ఆడి వారియర్స్‌పై ఒత్తిడి పెంచారు. ప్రథమార్ధం 26-22 స్కోరుతో ముగిసింది. ద్వితీయార్ధంలో పుంజుకునేందుకు యత్నించిన బెంగాల్ వారియర్స్‌ను పుణెరి డిఫెండర్లు నిలువరించారు. వారియర్స్ కెప్టెన్, స్టార్ రైడర్ దేవంక్ పలుమార్లు ప్రత్యర్థి డిఫెండర్లకు చిక్కడంతో మ్యాచ్‌పై పట్టు కోల్పోయారు. పుణెరి జట్టులో అస్లాం ఇనాందార్, ఆదిత్య షిండే చెరో 11 పాయింట్లు సాధించారు. హరియాణా స్టీలర్స్-యు ముంబా జట్ల మ్యాచ్ 36-36తో టైగా ముగిసింది. అయితే షూటౌట్‌లో హరియాణా విజయం సాధించింది.

శ్రీలంకదే తొలి టీ20

హరారే: జింబాబ్వేతో తొలి టీ20లో శ్రీలంక గెలుపొందింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 175/7 చేసింది. దుష్మంత చమీర 3 వికెట్లు తీశాడు. ఛేదనలో శ్రీలంక 19.1 ఓవర్లలో 177/6 స్కోరు చేసి గెలుపొందింది. నిస్సాంక (55), కమిందు మెండిస్ (41 నాటౌట్) రాణించారు.

కబడ్డీ విజేత జోగులాంబ లయన్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): యువ తెలంగాణ కబడ్డీ లీగ్ ట్రోఫీని జోగులాంబ లయన్స్ జట్టు కైవసం చేసుకుంది. బుధవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో లయన్స్ 35-21 స్కోరుతో భద్రాద్రి బ్రేవ్స్ జట్టుపై నెగ్గింది. లీగ్ ఉత్తమ రైడర్‌గా జి.రాజు, డిఫెండర్‌గా నవీన్, ఆల్‌రౌండర్‌గా లక్ష్మణ్‌కు ప్రత్యేక అవార్డులు లభించాయి. ఐపీఎస్ అధికారి రాహుల్ హెగ్డే, తెలంగాణ కబడ్డీ సంఘం అధ్యక్షుడు కాసాని వీరేష్, కార్యదర్శి మహేందర్ విజేతలకు ట్రోఫీ ప్రదానం చేశారు.

తిప్పేసిన నితిన్



చెన్నై: బుచ్చిబాబు ఆలిండియా క్రికెట్ టోర్నమెంట్ రెండో సెమీ ఫైనల్లో హరియాణాను 99 పరుగులతో ఓడించి హైదరాబాద్ జట్టు ఫైనల్‌లో ప్రవేశించింది. బుధవారం తమ రెండో ఇన్నింగ్స్‌లో హరియాణా 272 పరుగుల లక్ష్యంతో ఛేదన ప్రారంభించగా, హైదరాబాద్ లెఫ్టార్మ్ స్పిన్నర్ నితిన్ సాయి యాదవ్ (7/44) దెబ్బకు 62.4 ఓవర్లలో 181కు ఆలౌటై పరాజయం పాలైంది. అంతకు ముందు తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 225, హరియాణా 208కు, రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 254కు ఆలౌటయ్యాయి. హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 91 పరుగులతో రాణించిన వరుణ్ గౌడ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

ఇకపై మరింత బాధ్యతగా ఉంటాం

'చిన్నస్వామి' ఘటనపై కోహ్లీ



న్యూఢిల్లీ: బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో గత జూన్ నాలుగున జరిగిన తొక్కిసలాటపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ఎట్టకేలకు స్పందించాడు. 'అది.. మా ఫ్రాంచైజీ చరిత్రలో ఓ సంతోషకరమైన ఘట్టం కావాల్సింది. కానీ విషాదంగా మారింది. ఆ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన మా అభిమానుల గురించి ఆలోచిస్తున్నా. వారి గురించి ప్రార్థిస్తున్నా. ఇకపై జాగ్రత్తగా, బాధ్యతగా, గౌరవంగా ముందుకు సాగుతాం' అని కోహ్లీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ సీజన్ ఐపీఎల్ టైటిల్‌ను ఆర్‌సీబీ గెలుచుకున్న సందర్భంగా చిన్నస్వామి స్టేడియంలో ఏర్పాటు చేసిన విజయోత్సవంలో తొక్కిసలాట జరిగి 11 మంది క్రికెట్ ఫ్యాన్స్ మరణించగా, మరో 71 మంది గాయపడ్డారు.

వృద్ధి, ఉద్యోగాల కల్పనకు ఊతం

బిజినెస్

జీఎస్‌టీ సంస్కరణలపై హర్షాతిరేకాలు



ప్రభుత్వం బుధవారం ప్రకటించిన జీఎస్‌టీ సంస్కరణలు ఆర్థిక వృద్ధికి, ఉపాధికల్పనకు ఊతం ఇచ్చేలా ఉన్నాయి. ఒక పక్క భౌగోళిక, రాజకీయ పరిస్థితుల ప్రభావంతో దేశీయ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సవాలును ఎదుర్కొంటోంది. మరోపక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటు ఎగుమతుల రంగానికి తీరని కాటుగా పరిణమించింది. గత కొద్ది కాలంగా ఎగుమతుల రంగం భారీ తిరోగమనంలో ఉంది. సుంకాల ప్రభావం వల్ల రాబోయే కాలంలో ఎగుమతులు భారీగా పడిపోవచ్చునన్న భయాలు కూడా సర్వత్రా నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య దేశీయ వినియోగాన్ని గణనీయంగా పెంచుతుందని, తద్వారా ఎగుమతుల నష్టాన్ని భర్తీ చేస్తుందని విశ్లేషకులంటున్నారు. దీనికి తోడు దేశంలో పండుగల సీజన్ ప్రారంభమవుతోంది. ఈ సీజన్‌లో వస్తు సేవల వినియోగం పెరిగి ఆర్థిక వ్యవస్థ ఉత్తేజితం కావడానికి ఈ చర్య దోహదపడుతుందన్నది వారి అభిప్రాయం. దేశంలో జీఎస్‌టీ ప్రవేశపెట్టిన తర్వాత తొలి భారీ ప్రక్షాళన ఇదే. ఈ చర్యల ఫలితంగా ప్రభుత్వం పన్నుల రూపేణ ఆదాయాన్ని నష్ట పోయినా, దేశీయ వినియోగం భారీగా పెరిగి ఆర్థిక వ్యవస్థ సుంకాల పోటు నుంచి చాలా వరకు బయట పడుతుందని ఆర్థిక నిపుణుల అంచనా. దీంతో ఇప్పటి వరకు నీరసించిన ప్రైవేటు పెట్టుబడులు సైతం ఊపందుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదే జరిగితే జీడీపీ వృద్ధి రేటుకూ ఢోకా ఉండదని అంచనా. ఇప్పటివరకు ఉన్న శ్లాబ్‌లను రెండు శ్లాబ్‌లకు కుదించడం ద్వారా సగటు మనిషి వినియోగించే అనేక వస్తువులు 5 శ్లాబ్‌లోకి జారుకుని సగటు జీవికి ఉపశమనం కలుగుతుంది. దీన్ని దేవీ నవరాత్రులు, దీపావళి ముందు ప్రభుత్వం ప్రకటించిన బొనాంజాగా నిపుణులు, పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఈ సంస్కరణలు సగటు జీవిపైనే కాకుండా రైతాంగం, చిన్న వ్యాపారులపై కూడా భారాన్ని గణనీయంగా తగ్గిస్తాయన్నది వారి అభిప్రాయం. ఇది సగటు జీవికి అసలైన పండుగ అని ప్రభుత్వాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

పురోగామి చర్య : ఎంట్రీ లెవల్ టూ వీలర్లు, కార్లపై విధించే జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి కుదించడంపై ఆటోమొబైల్ పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'జీఎస్‌టీ రేట్లను హేతుబద్ధం చేయాలని మేము ఎప్పటి నుంచో కోరుతున్నాం. ప్రభుత్వం ఎట్టకేలకు మా మొర ఆలకించింది' అని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని ఆయన సరైన సమయంలో తీసుకున్న పురోగామి చర్యగా అభివర్ణించారు.ఈ చర్య తప్పకుండా దేశంలో కార్ల డిమాండ్‌ను పెంచుతుందన్నారు. అన్ని రకాల ఆటోమొబైల్ విడి భాగాలను 28 శాతం జీఎస్‌టీ నుంచి 18 శాతం జీఎస్‌టీ శ్లాబులోకి మార్చడంపై ఆ కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే ఆటోమోటివ్ కంపోనెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఏసీఎంఏ) ప్రశంసించింది. ఎప్పటి నుంచో అడుగుతున్న తమ ఈ కోరికను ప్రభుత్వం ఇన్నాళ్లకు మన్నించిందని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ విన్నీ మెహతా తెలిపారు.

స్టాక్ మార్కెట్ పరుగే

జీఎస్‌టీ నిర్ణయం గురువారం స్టాక్‌మార్కెట్‌కు పెద్ద ఉత్తేజం కావచ్చునని మార్కెట్ నిపుణులంటున్నారు. ఇటీవల కాలంలో ఈక్విటీ, ఫారెక్స్ మార్కెట్లు భారీ ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో మార్కెట్ తాత్కాలికంగా ఊపిరి తీసుకోవడం ఖాయమని, గురువారం మార్కెట్ సానుకూలంగా స్పందించవచ్చునని పరిశీలకులన్నారు.

చిన్న కార్ల ధరలు ఎంత తగ్గొచ్చు..?

4మీటర్లలోపు వాహనాల విభాగంలో 1200 సీసీ వరకు పెట్రోల్ కార్లపై ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీతోపాటు ఒక శాతం సెస్సు కూడా చెల్లించాల్సి ఉంటుంది. 1500 సీసీ వరకు డీజిల్ కార్లపై కేంద్రం 28 శాతం జీఎస్‌టీతోపాటు 3 శాతం సెస్సు వసూలు చేస్తోంది. ఈ విభాగ కార్లను తాజాగా 18 శాతం శ్లాబులో చేర్చారు. దీంతో చిన్న, హ్యాచ్‌బ్యాక్ మోడళ్ల ధరలు 8-10 శాతం వరకు తగ్గవచ్చని అంచనా వేసింది. మారుతి సుజుకీ చిన్న కారు ఆల్టో కే10 ఎక్స్‌షోరూమ్ ధర రూ.4.23 లక్షల నుంచి రూ.3.89 లక్షలకు తగ్గే అవకాశం ఉంది. హ్యుండయ్ హ్యాచ్ బ్యాక్ మోడల్ గ్రాండ్ ఐ10 మోడల్ రేటు రూ.5.98 లక్షల నుంచి రూ.5.51 లక్షలకు దిగిరావచ్చు. రెనో క్విడ్ ఎక్స్ షోరూమ్ ధర కూడా రూ.40,000 వరకు తగ్గవచ్చని అంచనా.

ఎగుమతిదారుల హర్షం: ఇక నుంచి వారం రోజుల్లోనే జీఎస్‌టీ రిఫండ్స్ ప్రక్రియ పూర్తి కానుంది. ఇది ఎగుమతిదారుల నిధుల కొరత సమస్యనూ తీరుస్తుందని భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1,000 వరకు ఉన్న జీఎస్‌టీ రిఫండ్‌లను అనుమతించడం ఇ-కామర్స్ ఎగుమతిదారులకు పెద్ద ఊరట అన్నారు.

ద్రవ్యోల్బణం కట్టడికి దోహదం: జీఎస్‌టీ రేట్ల తగ్గింపు వస్తు, సేవల వినియోగం భారీగా పెరగడంతోపాటు ద్రవ్యోల్బణం కట్టడి, ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల కల్పనకూ ఊతమివ్వనుందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. మరింత సరళమైన, పారదర్శకమైన, సమగ్ర పన్ను వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తాజా సంస్కరణలు దోహదపడనున్నాయని మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ డాక్టర్ అనిశ్ షా అన్నారు.

రియల్టీ, మౌలిక రంగాలకు బూస్ట్ : సిమెంట్, స్టీల్‌పై జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతం తగ్గించడం రియల్ ఎస్టేట్, మౌలిక రంగాల నిర్మాణ వ్యయాలను గణనీయంగా తగ్గించనుందని నరెడ్కో జాతీయ అధ్యక్షుడు, హీరానందిని గ్రూప్ చైర్మన్ నిరంజన్ హీరానందిని అన్నారు. ముఖ్యంగా అందుబాటు గృహ ప్రాజెక్టులకు లబ్ధి చేకూరనుందని, నిర్మాణ వ్యయం తగ్గితే కొనుగోలుదారులకు ఈ గృహాలు మరింత తక్కువ ధరకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యానికి తోడ్పాటు: 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం జీడీపీ ఏటా 7 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేయాల్సిన అవసరం ఉంది. ట్రంప్ 50 శాతం సుంకాలతో ఎగుమతి ఆధారిత రంగాల వ్యాపారంపై ప్రభావం చూపనున్న తరుణంలో జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దేశీయంగా వినియోగాన్ని పెంచి వృద్ధి రేటుకు అండగా నిలవనుందని హీరానందాని అన్నారు.

బంగారం @ రూ.1.07 లక్షలు

వరుసగా 8 రోజుల్లో రూ.6,900 అప్



పసిడి సరికొత్త జీవనకాల పతాక స్థాయికి ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మరో రూ.1,000 పెరిగి రూ.1,07,070కి చేరింది. 99.5% స్వచ్ఛత గల బంగారం రేటు కూడా అదే స్థాయిలో ఎగబాకి రూ.1,06,200కి చేరుకుంది. కిలో వెండి మాత్రం ఎలాంటి మార్పు లేకుండా రూ.1,26,100 పలికింది. బంగారం ధరలు పెరగడం వరుసగా ఇది ఎనిమిదో రోజు. గడిచిన 8 రోజుల్లో తులం బంగారం రూ.6,900 పెరిగింది. అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఈ నెలలో ప్రామాణిక వడ్డీరేట్లను మరో 0.25% తగ్గించవచ్చన్న అంచనాలతోపాటు అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చితులు బంగారం, వెండి ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర రేటు తొలిసారిగా 3,600 డాలర్ల మైలురాయిని దాటింది. ఒకదశలో 3,622 డాలర్ల వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. సిల్వర్ 41.35 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. అంతర్జాతీయంగా వీటి ధరలు ముందు మరింత ఎగబాకవచ్చని బులియన్ నిపుణులు భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4 తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	570
వరంగల్	537	గోదావరి	570
చిత్తూరు	578	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — పెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	127
వరంగల్	98	గుంటూరు	115
కరీంనగర్	98	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	90
కర్నూలు	98	నెల్లూరు	95
విశాఖపట్నం	131	అనంతపురం	95
గోదావరి	127		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,06,970 ▲	98,050 ▲	1,37,000 ▲
విజయవాడ	1,09,000 ▲	1,03,000 ▲	1,26,700 ▲
విశాఖపట్నం	1,09,430 ▲	97,250 ▲	1,37,000 ▲
రాజమండ్రి	1,06,960 ▲	98,050 ▲	1,26,400 ▼
ప్రొద్దుటూరు	1,07,200 ▲	98,620 ▲	1,26,000 ▲
ముంబై	1,06,020 ▲	97,120 ▲	1,23,220 ▲

మారుతి కొత్త కారు విక్టోరిస్

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా తన స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ (ఎస్‌యూవీ) పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. ఈ విభాగంలో బ్రెజ్జా, ఫ్రాంక్స్, జిమ్నీ, గ్రాండ్ విటారా వంటి మోడళ్లను విక్రయిస్తున్న కంపెనీ.. విక్టోరిస్ పేరుతో మరో కాంపాక్ట్ ఎస్‌యూవీని బుధవారం ఆవిష్కరించింది. హ్యుండయ్ క్రెటా, కియా సెల్టోస్, హోండా ఎలివేట్, టయోటా హైరైడర్, టాటా కర్వ్, స్కోడా కుషాక్, ఫోక్స్‌వేగన్ టైగున్‌కు పోటీగా ఈ కారును మార్కెట్లోకి ప్రవేశపెడుతోంది. 1.5 లీటర్ పెట్రోల్, సీఎన్‌జీ, హైబ్రిడ్ ఇంజన్ ఆప్షన్లతో కూడిన ఈ కారును అరెనా షోరూమ్స్ ద్వారా విక్రయించనున్నట్లు కంపెనీ తెలిపింది. మొత్తం ఆరు వేరియంట్లు, పది రంగుల్లో లభించనున్న ఈ కారులో మారుతి పలు ఆధునిక ఫీచర్లను అందుబాటులోకి తెచ్చింది. రూ.11,000తో బుకింగ్ సౌకర్యాన్ని ప్రారంభించిన కంపెనీ.. కారు ధరను త్వరలోనే ప్రకటించనుంది. దీని ప్రారంభ ధర రూ.9.75 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా. భద్రతకు సంబంధించి ఈ కారుకు 5-స్టార్ భారత్ ఎన్‌క్యాప్ సేఫ్టీ రేటింగ్ లభించినట్లు సంస్థ తెలిపింది.

సెన్సెక్స్ 410 పాయింట్లు అప్

తొలుత తడబాటు.. ఆఖర్లో జోరు

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం ట్రేడింగ్‌లో మధ్యాహ్నం వరకు లాభనష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, ఆఖరి గంటలో భారీగా పుంజుకున్నాయి. దాంతో సెన్సెక్స్ 409.83 పాయింట్ల వృద్ధితో 80,567.71 వద్ద, నిఫ్టీ 135.45 పాయింట్ల పెరుగుదలతో 24,715.05 వద్ద ముగిశాయి. జీఎస్‌టీ మండలి సమావేశంలో తీసుకోబోయే నిర్ణయాలపై ఆశాభావంతోపాటు మెటల్ షేర్లలో ర్యాలీ ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 21 రాణించాయి. టాటా స్టీల్ షేరు 5.90 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.90% శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.63% ఎగబాకాయి. రంగాలవారీ సూచీల్లో మెటల్ 3.08 శాతం పుంజుకోగా.. కమోడిటీస్, హెల్త్‌కేర్ ఒక శాతానికి పైగా పెరిగాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మరో రూ.1,666.46 కోట్ల నికర అమ్మకాలకు పాల్పడగా.. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు నికరంగా రూ.2,495.33 కోట్ల కొనుగోళ్లు జరిపారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఆల్‌టైం కనిష్ఠ స్థాయి నుంచి కాస్త కోలుకుంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు పెరిగి రూ.88.06 వద్ద ముగిసింది.

హైదరాబాద్-ఆమ్‌స్టర్‌డామ్ మధ్య డైరెక్ట్ విమాన సర్వీసు

కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నెదర్లాండ్ కేంద్రంగా పనిచేసే కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ మన దేశంలో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్ నుంచి నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డామ్‌కు డైరెక్ట్ విమాన సర్వీసులు ప్రారంభించింది. వారానికి మూడు రోజులు ఈ సర్వీసులు నడుస్తాయని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మార్టెన్ స్టీనెన్ చెప్పారు. బెంగళూరు, ఢిల్లీ, ముంబై తర్వాత భారత్‌లో హైదరాబాద్ తమకు నాలుగో ప్రవేశ ద్వారమని తెలిపారు. ప్రస్తుతం ఈ నాలుగు నగరాల నుంచి ఆమ్‌స్టర్‌డామ్ వారానికి 24 విమాన సర్వీసులు నడుపుతోంది. వింటర్ సీజన్‌లో ఈ సర్వీసులను 27కు పెంచనున్నట్టు మార్టెన్ స్టీనెన్ చెప్పారు. ఫార్మా, ఐటీ కంపెనీలకు కేంద్రంగా ఎదిగిన హైదరాబాద్ నుంచి సరుకు రవాణాకు అద్భుత అవకాశం ఉందన్నారు. బోయింగ్ 777-200ఈఆర్ విమానాలతో ప్రారంభించిన హైదరాబాద్-అమెస్టర్‌డ్యామ్ విమాన సర్వీసులో వివిధ తరగతుల్లో 288 మంది ప్రయాణించ వచ్చని కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ అధికారులు చెప్పారు.

హైదరాబాద్‌లో యునిస్పేస్ మెగాస్టోర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : నిర్మాణ, నిర్మాణ పరికరాల రంగంలోని అపర్ణా ఎంటర్‌ప్రైజెస్ (ఏఈఎల్) హైదరాబాద్‌లోని మియాపూర్‌లో యునిస్పేస్ మెగాస్టోర్‌ను ప్రారంభించింది. ఇది ఆసియాలోనే అతి పెద్ద స్టోర్ అని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. తమ రిటైల్ విస్తరణలో భాగంగా బెంగళూరు, ఢిల్లీ, ముంబై నగరాల్లో కూడా ఇదే తరహా స్టోర్లు ప్రారంభించాలనుకుంటున్నట్టు చెప్పారు. భవన నిర్మాణంలో ఉపయోగించే 20 రకాల వస్తువులకు ఇది వన్ స్టాప్ సొల్యూషన్‌గా ఉంటుందని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ శ్రేయాస్ త్రివేది వెల్లడించారు. కస్టమర్లకు ఇంటి డిజైన్, నిర్మాణం, ఆధునీకరణ వంటి సేవలన్నీ ఒకే ఛత్రం కింద అందించాలన్నది తమ కాన్సెప్ట్ అని ఆయన చెప్పారు. ఇది కస్టమర్లకు సరికొత్త అనుభూతిని అందిస్తుందని ఆయన అన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రికి గ్రీన్ సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా అత్యాధునికవసతులతో మొదట ఈఎస్ఐ ఆసుపత్రులు, తరువాత ఆసుపత్రులకు అనుబంధంగా మెడికల్ కళాశాల ఏర్పాటుచేయాలని కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ ఆధ్వర్యంలోని ఈఎస్ఐసీ బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు ఈ ప్రాంగణంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి జూలై 2022న ఈఎస్ ఐసీ రీజనల్ డైరెక్టర్ రేణుక ప్రసాద్ ఆధ్వర్యంలో సైట్ సెలక్షన్ కమిటీ పరిశీలన జరిపి ఆమోదం తెలిపింది.

● 25వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ప్రయోజనం..

రామగుండంలో 100పడకల ఆసుపత్రి వినియోగంలోకి వస్తే పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలోని సుమా రు 40వేల మంది కాంట్రాక్టు కార్మికులకు, కుటుం బాలకు ప్రయోజనం చేకూరనున్నది. ఎన్టీపీసీ, సింగ రేణి, ఆర్ఎఫ్సీఎల్, కేశోరాం సిమెంట్స్, జెన్కో, రైల్వే, రామ గుండం మున్సిపల్ కార్పొరేషన్, మంథని, పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు, రైస్మిల్లులు, కాటన్, జిన్నింగ్ మిల్లులు, ఎక్స్ప్లోజివ్ కంపెనీలు, ట్రాన్స్పోర్టులు, మెడికల్ కళాశాలలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, సింగరేణి జైపూర్ పవర్ప్లాంట్, సిరామిక్స్ కంపెనీలు, తదితర సంస్థల్లో కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. వీరిని ఇప్పటి వరకు వరంగల్లోని ఆసుపత్రికి రెఫర్ చేసేవారు. రామగుండం ఆసుపత్రి నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వస్తే రామగుండంలోనే అన్నిరకాల వైద్య సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. కాంట్రాక్టు కార్మికులకు చికిత్సకు ప్రైవేట్ ఆసుపత్రుల చుట్టూ తిరిగే భారం తగ్గనున్నది.

రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడితోనే నిర్మాణానికి టెండర్లు..

- ఎమ్మెల్యే రాజ్ఠాకూర్



రామగుండంలో ఈఎస్ఐ ఆసుపత్రి, మెడి కల్కళాశాల నిర్మించాల్సి ఉంది. గతంలో బీఆర్ఎస్, బీజేపీ వివాదంలో పెడింగ్లో పెట్టారు. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, మంత్రి శ్రీధర్బాబు, ఎంపీవంశీకృష్ణ సహకారం తో ఒత్తిడిపెంచాం. ముఖ్యమంత్రి ఢిల్లీలో కేంద్ర కార్మికశాఖ మంత్రిని కూడా ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ప్రిన్సిపాల్ సెక్రెటరీగా ఉన్న దానకిశోర్ ఎప్పకటిప్పుడు పర్యవేక్షించారు. ఈ ఆసుపత్రి నిర్మాణంతో ఈప్రాంతంలోని కాంట్రాక్టు కార్మికులకు కార్పొరేట్ వైద్యం అందనున్నది.

గణేష్ మండపాల్లో గోపూజలు, అన్నదానాలు

సుల్తానాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నవరాత్రుల్లో భాగంగా సుల్తానాబాద్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన గణపతి మండపాల వద్ద గోపూజలు, అన్నదానాలు నిర్వహించారు. పాతబజారులోని శివాలయంలో, పూసాలభక్త మార్కండేయ స్వామి ఆలయంలోని గణేష్ మండపంలో గోపూజ, అన్నదానాలు, పట్టణంలోని పలు ప్రాంతాల్లో అన్నదానాలు చేశారు. మహా నైవేద్యాలు సమర్పించారు. మండలంలోని పలుగ్రామాలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటుచేసిన వినాయక మండపాలల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, గర్రెపల్లి మాజీసర్పంచ్, సుల్తానాబాద్ మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు పడాల అజయ్, పన్నాల రాములు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. మండల బీఆర్ఎస్ నాయకులు తాళ్లపల్లిమనోజ్గౌడ్ తదితరులు పలుగ్రామాల్లోని మండపాలనుసందర్శించి, మొక్కులు చెల్లించుకున్నారు.

పాలకుర్తి: మండలంపరిధిలోని బసంత్నగర్, పాలకుర్తి, ఈసాలతక్కళ్లపల్లి గ్రామాల్లోని గణేష్ మండపాలను బుధవారం మక్కాన్సింగ్ సేవా సమితి చైర్పర్సన్ మనాలి ఠాకూర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశికహరి, రామగుండం కార్పొరేషన్ 22వ డివిజన్ కార్పొరేటర్ కౌశిక లత వేర్వేరుగా సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మనాలిఠాకూర్ను తక్కళ్లపల్లిలో మహిళలు సత్కరించారు.

ఓదెల: మండల కేంద్రంతోపాటు కొలనూర్, మడక, పొత్కపల్లి, జీలకుంటగ్రామాల్లో మంగళవారం వినాయక మండపాల్లో మహిళలు కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బండారి ఐలయ్య, కొంగర అనిల్, వీర్ల సదయ్య జీగురు రాజేందర్, ఉప్పుల వెంకటేశ్వర్ల తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్నగర్: గణపతి నవరాత్రుల్లో భాగంగా 8వ రోజు గోదావరిఖని పట్టణంలో పలు వినాయక మండపాల వద్ద మహిళలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. దుర్గానగర్లోని గణేషుని వద్ద రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్ గణనాథునికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామగుండం ప్రజలను గణపయ్య చల్లనిఆశీస్సులతో చూడాలని వేడుకున్నారు. కళ్యాణ్నగర్లోని కళ్యాణ్యూత్ ఆధ్వర్యంలో మహిళలు ఘననాథునికి ప్రత్యేక పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. లక్ష్మీనగర్లోని బులియన్ మార్కెట్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకుడు మహంకాళి స్వామి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిలక్నగర్, విఠల్నగర్, గంగానగర్, బాపూజీనగర్ ఏరియాల్లోని గణనాథులను సందర్శించి పూజలు నిర్వహించారు. లక్ష్మీనగర్లోని గణేష్ మండపంలో మహిళలు గోరింటాకు పండుగను నిర్వహించారు. మహిళలు గోరింటాకు పెట్టుకున్నారు.

వైటింక్లయిన్కాలనీ: కాలనీపరిధిలోని షిర్కేసాయి మారుతీనగర్లో వినాయకుడికుడికి 108ప్రసాదాలతో పూజలు చేశారు. పలు మండప నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

రామగిరి: మండలంలోని లొంకకేసారం హనుమాన్ ఆలయంలో మాజీసర్పంచ్ ఎండీ మంజూర్ అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం పెద్దఎత్తున చేపట్టారు. గ్రామంలో హిందువుల పండుగల్లో కులమతాలకు అతీతంగా తన సొంత ఖర్చులను వెచ్చించి ఘనంగా నిర్వహి స్తారు. అందులో భాగంగా గణపతి నవరాత్రిని పురస్కరించుకొని వినాయకమండపం ఎదుట అన్నసంతర్పణ కార్యక్రమాన్ని చేపట్టారు. పెద్దసంఖ్యలో గ్రామసులు, మహిళలు పాల్గొన్నారు.



సుల్తానాబాద్ శివాలయంలో గోవుకు పూజలు చేస్తున్న భక్తులు



ఈసాలతక్కళ్లపల్లిలో మనాలి ఠాకూర్ను సన్మానిస్తున్న మహిళలు



సాయిమారుతీ నగర్లో గణపతికి 108 ప్రసాదాలతో భక్తులు



అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మాజీ సర్పంచ్ ఎండీ మంజూరు

నానో యూరియాను వాడాలి

పాలకుర్తి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కంటే ద్రవరూపంలో ఉన్న నానోయూరియా వాడడం ఉత్తమమని మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష నానో కంపెనీ వాళ్లతో మాట్లాడి అరలీటర్ బాటల్ మార్కెట్ ధర 225ఉండగా 75రూపాయలు తగ్గించి రైతులకు 150కే ఇప్పించేందుకు ఏర్పాటు చేశారని ఈ అవకాశాన్ని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎలిగేడు: రైతులకు అందుబాటులో నానోయూరియాప్లస్ ఉందని మండల వ్యవసాయ అధికారి ఉమాపతి తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని సింగిల్ విండో గోదాంలో రైతులకు నానో యూరియా ప్లస్పై అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నానోయూరియా ప్లస్ను జిల్లా కలెక్టర్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి రూ.250ధరకు ఉండగా, రైతులకు రూ.150కే అందుబాటులో ఉండేలా తీసుకువచ్చారని తెలిపారు. ఒక ఎకరానికి బాటిల్నర పురుగుల మందుతో కలిపి పిచికారి చేస్తే 20 రోజుల వరకు మొక్కలకు నత్రజని అందుతుందన్నారు.



నానో యూరియాపై రైతులకు అవగాహన చేస్తున్న ఏవో

మంత్రి శ్రీధర్బాబుపై ఆరోపణలు చేస్తే సహించేది లేదు

మంథని, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేస్తున్న రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబుపై అసత్యపు ఆరోపణలు చేస్తే తగిన గుణపాఠం చెప్తామని కాంగ్రెస్పార్టీ ఎస్సీసెల్ మంథని నియోజకవర్గఅధ్యక్షుడు మంథని సత్యం, మాజీ ఎంపీటీసీ చంద్రు రాజమల్లు హెచ్చరించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. స్థాయిలేని బీఆర్ఎస్ నేతలు కొందరు వారి నాయకుడి మెప్పుకోసం ఇష్ట వచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉంటూ మంత్రివివేక్ను కలుస్తూ వారిఫోటోలు పెట్టుకొని మాల సామాజిక వర్గంలో చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తమ నాయకులు మంత్రి శ్రీధర్బాబు, శ్రీనుబాబుపై తప్పుడు ఆరోపణలు చేస్తే గుణపాఠం చెప్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మంథని రాకేష్, దాసరి గట్టయ్య, రొడ్డ రాజేశ్వర్రావు, తోకల మల్లేష్, మంథని సమ్మయ్య కాసిపేట బాపు, అక్కపాక సది, రమేష్, బానేష్ జానీలు పాల్గొన్నారు.

రైతులపై నీ కపట ప్రేమ ప్రజలందరికీ తెలుసు

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం



మాట్లాడుతున్న ముత్తారం మాజీజడ్పీటీసీ చొప్పరి సదానందం

ముత్తారం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులపై నీ కపట ప్రేమ ప్రజలందరికీ తెలుసని పుట్ట మధును ఉద్దేశించి కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, ముత్తారం మాజీజడ్పీటీసీ చొప్పరి సదానందం అన్నారం. ముత్తారం మండలంలోని కేశనపల్లిలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో అయన, కమాన్పూర్ మార్కెట్ కమిటీవైస్చైర్మన్ మద్దెల రాజయ్యతో కలిసి మాట్లాడారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పట్టపగలు నడిరోడ్డుపై అతికిరాతకంగా నరికిచంపిన లాయర్ దంపతు(నాగమణివామన్రావు)ల కేసును సీబీఐకి అప్పగించడంతో పుట్ట మధుకు మతి భ్రమించిందని, అందుకే ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నాడన్నారు. మిడిమిడి జ్ఞానంతో రాష్ట్రప్రభుత్వానికి సంబంధం లేని యూరియా నిల్వలను సైతం మంత్రి శ్రీధర్బాబుకు అంటగట్టడం అతని అజ్ఞానానికి నిదర్శనం అని అన్నారు. మరోసారి దుద్దిళ్ల కుటుంబంపై పిచ్చి మాటలు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కమాన్పూర్ మార్కెట్కమిటీ డైరెక్టర్లు బొల్లినేని బుచ్చరావు, జాగిరిసమ్మయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కతట్ల వినీత్, బీసీసెల్ మండల అధ్యక్షుడు అల్లం కుమారస్వామి, కిసాన్సెల్ మండలాధ్యక్షుడు గాదం శ్రీనివాస్, మాజీ సర్పంచ్లు మెడగోని సతీష్, వకుళరాణిశంకర్, మాజీ ఎంపీటీసీ మల్యాల రాజయ్య, కాంగ్రెస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతో సాధ్యమని ఆశాఖ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పుల్లపు దామోదర్రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పెగడపల్లిలో ఉపా ధ్యాయులతోకలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించిందని, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ఐటీమంత్రి శ్రీధర్బాబు, రాష్ట్రప్రధానకార్యదర్శి రామకృష్ణారావుసానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈసందర్భంగా మండలశాఖ అధ్యక్షుడు ముంజాల హరికృష గౌడ్ రాష్ట్రప్రధానకార్యదర్శి దామోదర్రెడ్డి, వంగమహేందర్రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లాఅధ్యక్షప్రధానకార్యదర్శులు గండికృష్ణమూర్తి, కానుగంటిశ్రీనివాస్, పెద్దపల్లి మండలాధ్యక్షుడు తిరుపతి, జిల్లామాజీ అధ్యక్షుడు నారాయణ పాల్గొన్నారు.

చేయూత పెన్షన్ల పంపిణీపై ఒక రోజు శిక్షణ

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చేయూత పెన్షన్ల పంపిణీపై మున్సిపల్కమిషనర్లు, ఎంపీడీవోలు, మున్సిపల్వార్డుఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, పోస్టాఫీస్ బ్రాంచిమేనేజర్లకు బుధవారం ముఖగుర్తింపు పద్ధతిపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టరేట్లో నిర్వహించారు. పెన్షన్ల మంజూరిలో పాటించాల్సిన నియమాలు, నిబంధనలు, అర్హతలు, పంపిణీపై సెర్ప్ చేయూత విభాగం డైరెక్టర్ గోపాల్రావు పవర్పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సెర్ప్ చేయూత పెన్షన్ విభాగం ఏపీఎం, అదనపు కలెక్టర్, జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి, అదనపుగ్రామీణ అభివృద్ధిఅధికారితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలి

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లావైద్యారోగశాఖ అధికారి వాణిశ్రీ బుధవారం ఆర్బీఎస్కె మొబైల్ హెల్త్టీం, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం, అలాగే కీటకజనిత వ్యాధులపై మల్టీపర్పస్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లు టెస్టులను పెంచాలని, ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు శ్రీరాములు, కిరణ్కుమార్, వైద్యాధికారులు, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ ఉమా మహేశ్వర్, సబ్ యూనిట్ ఆఫీసర్లు రవీందర్, అంజయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

నాటిన ప్రతిమొక్కను రక్షించాలి: డీఎల్పీవో

జూలపల్లి, సెప్టెంబరు 3. (ఆంధ్రజ్యోతి) నాటిన ప్రతిమొక్కను రక్షంచేందుకు కృషిచేయాలని డీఎల్పీవో వేణుగోపాల్ అన్నారు. మండలంలోని పెద్దాపూర్, కుమ్మరికుంట గ్రామాల్లోని అవెన్యూప్లాంటేషన్ను బుధవారం ఆయన సందర్శించారు. ఆయన వెంట ఎంపీవో శేషయ్యసూరి, ఏపీవో సదానందం ఉన్నారు.

సోచ్ ఫౌండేషన్కు విద్యార్థుల చేయూత

జూలపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని న్యూబ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు సోచ్ఫౌండేషన్కు విరాళాలు అందించి ఆదర్శంగా నిలిచారు. హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న సోచ్ ఫౌండేషన్కు తమవంతు కృషిగా విద్యార్థులు సేకరించిన విరాళాలను బుధవారం మండల విద్యాధికారి సరస్వతిఆధ్వర్యంలో ఫౌండేషన్సభ్యులకు విద్యార్థులు విరాళాలను అందజేశారు.

జిల్లా స్థాయి టాలెంట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఆవిష్కార అభియాన్లో భాగంగా జిల్లాస్థాయి గణిత, సైన్స్క్విజ్ పోటీలు బుధవారం స్థానిక జడ్పీఉన్నత పాఠశాలలో నిర్వహించారు. మండలస్థాయిలో విజేతలుగా నిలిచిన 150మందివిద్యార్థులు పాల్గొనగా, ప్రాథమికోన్నతస్థాయిలో ఐదుగురు, సెకండరీ స్థాయిలో ఐదుగురు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో సెకండరీ పాఠశాలల విద్యార్థులు విక్రాంత్, భువన, పరమేష్, అఖిల్, ఎలిమెంటరీ స్థాయిలో ఠాగూర్, సిద్దార్థ్, సాదుల్లా బడా, చైత్ర, విజ్ఞసాయి ఎంపికయ్యారు వీరిని జిల్లావిద్యాధికారి మాదవి అభినందించి ప్రశంసాపత్రాలు, మెమోంటోలు అందించారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ కోఆర్డినేటర్ పీఎం షేక్, డీసీఈబీ కార్యదర్శి హన్మంతు, మండల విద్యాధికారి సురేందర్, గెజిటేడ్ ప్రధానోపాధ్యాయులు అరుణ గణిత ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

గ్రామపేరుతో బోర్డు ఏర్పాటు

ఎలిగేడు, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాకల్దేవ్పల్లి గ్రామంలోని గణేష్యూత్ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో బుధవారం గ్రామపేరు బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సభ్యులు ఆసంపల్లి వసంత్, సుందరగిరి అజేయ్, బుర్రకుమార్, వినేయ్, శివకృష్ణ, రాజేందర్, తిరుపతిరెడ్డి, దామోదర్, రాకేష్, సభ్యులు, గ్రామయువకులు శంకర్, మధు, మహేష్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబొంకూరు గ్రామానికిచెందిన పిల్లలమర్రి వీరేశం విద్యుత్శాఖలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన సందర్భంగా బుధవారం వినాయక మండపంలో ఉత్సవకమిటీ సభ్యులు సత్కరించారు. ఈసందర్భంగా ఉత్సవకమిటీకి రూ.20 వేల విలువ గల మైక్సెట్ను అందించారు. కార్యక్రమంలో మిట్టపల్లి శ్రీనివాస్, సీపెల్లి శ్రీనివాస్, కలవేన రవి, పాల్గొన్నారు.

రైస్బ్యాగుల అందజేత

కమాన్పూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆయా వార్డుల పరిధిలో ఏర్పాటు చేసిన గణపతులను పలువురు కాంగ్రెస్ నాయకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండలఅధ్యక్షుడు అన్వర్, కాంగ్రెస్ నాయకులు అయామండపాలవద్ద 25కేజీల రైస్ను అందజేశారు. ఇందులో గోకుల్నగర్, కేశవనగర్, హనుమాన్నగర్, ప్రగతినగర్, కమ్మరివాడ,హైస్కూల్, దాసరి పల్లిమండపం, ఓల్డ్అంబేద్కర్నగర్, న్యూఅంబేద్కర్నగర్, వేణు గోపాలస్వామి ఆలయం, న్యూఅంబేద్కర్ మండపం, యాదవనగర్ తదితరవాడల్లో ఏర్పాట్లు చేసిన మండపాలవద్ద వినాయకులను దర్శించుకుని బియ్యం అందజేశారు.

ఐకేపీ సీసీని సన్మానించిన తోటి మిత్రులు

కమాన్పూర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఐకేపీ సీసీగా బదిలీపై ఇటీవల వచ్చిన చేలకలపల్లి భిక్షపతిని పలువురు స్నేహితులు అతనిని మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం 1998-99బ్యాచ్కుచెందిన 10వ తరగతి మిత్రులు కేక్కట్ చేసి సన్మానించారు. కార్యక్రమంలో నాయిని గంగాధర్, జాబు సతీష్ కుమార్, కోలేటి శివకుమార్, రేవెల్లి శంకర్, పిట్టల తిరుపతి, మెడగొని విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడి కుటుంబానికి పరామర్శ

కమాన్పూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రాంనగర్కు చెందిన కాంగ్రెస్నాయకుడు మేడతిరుపతి మేనల్లుడు చీటివినోద్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అయన కుటుంబాన్ని బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్అన్వర్ పరామర్శించి25కేజీల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో దాసరి గట్టయ్య, సయ్యద్ ఇక్బాల్, మల్యాల తిరుపతి, గడపకృష్ణమూర్తి, ముస్తాక్, లక్ష్మిరాజం, సత్యం పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టిసారించాలి

రామగిరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అకడమిక్స్తో పాటు క్రీడలపై దృష్టి సారించాలని వైస్ప్రిన్స్పాల్ ఉదయ్కుమార్ అన్నారు. వర్షాలవల్ల వాయిదా పడిన వాలీబాల్లీగ్ పోటీలను కళాశాలలోని క్రీడాప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. మైభారత్ పెద్దపల్లి జిల్లా వలంటీర్ రేశవేన మహేష్ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి వైస్ప్రిన్స్పాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రథమ బహుమతిని నాల్గోవ సంవత్సరం విద్యార్థులకు, ద్వితీయబహుమతిని రెండవ సంవత్సరం విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి సుమన్రెడ్డి, ఫీజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, సునీల్కుమార్, మైభారత్ యువజన వాలంటీర్ రాహుల్,విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి అందిస్తున్న వైస్ప్రిన్స్పాల్

మాజీ పీఏసీఎస్ చైర్మన్కు నివాళి

మంథని, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంథని సింగిల్విండో మాజీచైర్మన్ మాదాడి సత్యనారాయణరెడ్డి ప్రథమవర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బుధవారం కరీంనగర్ డీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్రావు, బ్యాంక్ సీఈవో సత్యనారాయణ రావు, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంథని ప్రాంతంలో సింగిల్విండో అభివృద్ధికి, రైతులకు అందించిన సేవలను వారు కొనియాడారు.

త్రయంబకేశ్వరాలయంలో మహాప్రసాద వితరణ

రామగిరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణిసంస్థ ఆర్జీ-3 డివిజన్పరిధీలోని ఎస్అండ్ పీసీ కార్యాలయంలోని త్రయంబకేశ్వరాలయం ప్రాంగణంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం మహాప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్రావు, నాగేశ్వర్రావులు హాజరైప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆపరేటర్లు

బ్యాక్ డేట్తో ప్రమోషన్లు ఇవ్వాలి: ఆపరేటర్లు

యైటింక్లయిన్కాలనీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమకు రావాల్సిన ప్రమోషన్లను బ్యాక్డేట్తో వెంటనే ఇవ్వాలని రామగుండం రీజియన్ ఆపరేటర్లు సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సెప్టెంబరు 2021నాడు తమకు సీగ్రేడ్ ఆపరేటర్లుగా పదోన్నతులు రావాల్సి ఉన్నా సింగరేణి యాజమాన్యం ఇప్పటివరకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరేళ్ళుగా ఒకే గ్రేడ్లో మగ్గాల్సి వస్తున్నదని, ఇతర ఏరియాల్లో తమకంటే జూనియర్లు పదోన్న తులుపొంది సీనియర్లు అయినట్టు ఆపరేటర్లు పేర్కొన్నారు. యాజమాన్యం ఖాళీలు లేవంటూ ఏళ్లతరబడి తమకు ప్రమోషన్లు ఇవ్వకుండా నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నదని అన్నారు. ఇకనైనా యాజమన్యం స్పందిచ కుంటే ఆందోళనలకు సిద్ధమని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్ర యిస్తామని ఆపరేటర్లు హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సాలిగామ మల్లేష్, సత్యనారాయణ, క్రాంతి, తిరుపతి, కిరణ్కు మార్, రవి, రాజిరెడ్డి, సాగర్, రాజశేఖర్, విజ య్కుమార్, కురిమిళ్ల రవి, సాహిత్, శ్రీకాంత్, మామిడి అశోక్ పాల్గొన్నారు.



పట్టభద్రులైన డిపెండెంట్లకు క్లరికల్ గ్రేడ్-3 పోస్టులు ఇవ్వాలి

గోదావరిఖని, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గని ప్రమాదాల్లో మరణించిన ఉద్యోగుల వారసులకు ఇచ్చే కారుణ్యనియామకాల్లో పట్టభద్రులైన డిపెండెం ట్లకు క్లరికల్ గ్రేడ్-3 పోస్టులు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీతో బుధవారం హైదరాబాద్లో జరిగిన 51వ నిర్మాణాత్మక సమావేశంలో ఈ నిర్ణయం జరిగింది. ఈ మేరకు సంస్థ సీఎండీ బలరాంనాయక్ ఆదేశాలు కూడా జారీ చేశారు. సాంకేతికంగా గుర్తింపు సంఘంతో జరిగే ద్వైపాక్షిక ఒప్పందం అనంతరం డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో త్రైపాక్షిక ఒప్పందం చేసుకోనున్నారు. ఈ విద్యార్హత కలిగిన వారికి గతంలో జనరల్ అసిస్టెంట్లుగా మాత్రమే అవకాశం దక్కేది. ఇప్పుడు డిగ్రీ స్థాయి విద్యార్హత కలిగిన వారికి గ్రేడ్-3 క్లర్క్ ఉద్యోగాలు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. గత జూన్ 27వ తేదిన జరిగిన డైరెక్టర్(పర్సనల్) స్థాయి సమావేశంలో ఈ అంశంపై అధ్యయన కమిటీ వేశారు. ఆ కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సంస్థలో గ్రేడ్-3 క్లర్క్ పోస్టుల లభ్యతను భట్టి సంస్థ నిర్వహించే ప్రత్యేక పరీక్షలో డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు పాల్గొనాల్సి ఉంటుంది. పరీక్షలో పాస్ అయిన వారు మాత్రమే గ్రేడ్-3 క్లర్క్ పోస్టుకు అర్హత సాధిస్తారు. ఈపరీక్షలో ఉత్తీర్ణులుకాని వారికి క్యాటగిరి-1 జనరల్ అసిస్టెంట్గా గుర్తిస్తూ అవకాశం ఇస్తారు.

కొన్ని సంఘాలవి పసలేని ఆరోపణలు

● ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్

గోదావరిఖని, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీపై కొన్ని కార్మిక సంఘాలు పసలేని ఆరోపణలు చేస్తున్నాయని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ అన్నాడు. బుధవారం ఓసీపీ-5లో పలువురు ఏఐటీయూసీలో చేరిన సందర్భంగా జరిగిన సమావేశంలో ఎల్లాగౌడ్ మాట్లాడుతూ ఏఐటీయూసీ చరిత్రకలిగిన యూనియన్ అన్నారు. కార్మికవర్గ శ్రేయస్సు కోసం అనేక త్యాగాలు చేసిందన్నారు. ఈసందర్భంగా రైతులక్ష్మీనారాయణ నాయకత్వంలో పలువురు ఏఐటీయూసీలో చేరారు. కార్యక్రమంలో బ్రాంచ్కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు మహేష్, రంగుశ్రీను, వెంకటరెడ్డి, సిద్ధమల్ల రాజు, మల్లికార్జున్, గండి ప్రసాద్, దొంతు సారయ్య, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, ప్రభుదాస్, శంకర్, రవి, ఆశా, మల్లేష్, భాస్కర్, రియాజుద్దీన్ పాల్గొన్నారు.

గణనాథుడికి 108 రకాల నైవేద్యాలు

గోదావరిఖని, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జీఎం ఆఫీస్లో ఏర్పాటు చేసిన గణనాథునికి బుధవారం 108రకాలతో నైవేద్యాలు సమర్పించారు. కార్యాలయ క్లరికల్ సిబ్బంది భక్తి శ్రద్ధలతో గణనాథునికి ఈ నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో అతిథులుగా జీఎం లలిత్కుమార్, సేవా అధ్యక్షురాలు అనిత లలిత్కుమార్ వినాయకునికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యాలయంలో జరిగే నవరాత్రి ఉత్సవాల్లో భక్తి శ్రద్ధలతో ఉద్యోగులు పాల్గొనడం సంతోషకరమని జీఎం పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్లో ముందుకు సాగాలన్నారు. అందరిపై గణనాథు కృపాకటాక్షలు ఉండాలని జీఎం దంపతులు కోరారు. కార్యక్రమంలో ఫైనాన్స్ అధికారిని ధనలక్ష్మిబాయ్, పర్చేజ్ అధికారి భీమ, ఇతర అధికారులు శ్రావణ్కుమార్, హనుమంతరావు, సాంబశివరావు, ఊట్ల దేవాచారి, ఇందూరి సత్యనారాయణ, మురళీధర్, సంతోష్, ఓదెలు, సిబ్బంది పాల్గొన్నారు.



గణనాథునికి 108రకాల నైవేద్యాలు సమర్పించిన జీఎం, అధికారులు, సిబ్బంది

చలో ప్రజా భవన్

గోదావరిఖని, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గతఅసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతామని, ఇతరసమస్యలు పరిష్కరిస్తామని, కాంగ్రెస్పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల12న చలోప్రజాభవన్ కార్యక్రమంలో సింగరేణి కార్మికవర్గం అధిక సంఖ్యలో పాల్గొనాలని జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ఆర్జీ-1సివిక్ జోన్ల వద్ద సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ గేట్ మీటింగ్ నిర్వహించింది. సమావేశాల్లో జేఏసీ నాయకులు వేల్పుల కుమారస్వామి(సీఐటీయూ), ఈసంపల్లి రాజేందర్(టీయూసీఐ), మద్దెల శ్రీనివాస్ (టీసీకేఎస్) మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన నెలరోజుల్లోనే కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతామని, కోల్ ఇండియావేతనాలు ఇప్పిస్తామని ప్రభుత్వపెద్దలు చేసిన హామీలు నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లాఅధ్యక్షుడు తోకల రమేష్, సీఐటీయూ జిల్లా నాయకులు మేదరి సారయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి: ఐఎఫ్టీయూ

గోదావరిఖని, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు ఈ నరేష్ డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, అది సుప్రీంకోర్టు తీర్పు అని నరేష్ అన్నారు. బుధవారం రైల్వేసైడింగ్ వద్ద హైదరాబాద్ సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నరేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటితరంగ కార్మికుల పర్మినెంట్ కోసం సుప్రీం కోర్టు ఇచ్చినతీర్పును పరిగణలోకి తీసుకోవడం లేదని, దీంతో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికకుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాయని నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబరు 7న తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సదస్సులో కార్మికవర్గం అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజేశం, రాజేందర్, కిష్టయ్య, గడ్డి రాజు, ఎన్ కృష్ణ, సురేష్, వెంకటేష్, చిన్నయ్య పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐఎఫ్టీయూ నాయకులు

కాంట్రాక్టు కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్న ఎర్రజెండా యూనియన్లు

రామగిరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రీజియన్లో కాంట్రాక్టు కార్మికులను ఎర్ర జెండా యూనియన్లు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆర్జీ-3 కాంట్రాక్టు కార్మికసంఘం నాయకుడు ఉడుత శంకర్ బుధవారం ఐఎన్టీయుసీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆరోపించారు. దేశంలో ఎక్కడలేని విధంగా తొలిసారిగా కాంట్రాక్టు కార్మికుల ఖాతాలో రూ.5వేల లాభాల వాటా హక్కును ఐఎన్టీయూసీ నాయకుడు జనక్ప్రసాద్, ఐటిమంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు కృషిచేసి సాధించారని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులను మోసం చేసుకుంటూ వస్తూ అమాయకులైన కార్మికులను రోడ్లపైకి ఎక్కిస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులను అడ్డుగా పెట్టుకొని తమ స్వంత ప్రయోజనాలు పొందుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో ఐఎన్టీయూసీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.